PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 165 | విజయవాడ, మంగళవారం 17 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 17 January 2023 | Rs

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

- 68 మంది మృతి
- మరో నలుగురి కోసం గాలింపు
- బ్లాక్ బాక్స్ లభ్యం

● లోపలి పేజీలో.. ●

షెఫాలీ మెరుపులు

- యుఎఇపై 122 పరుగుల తేడాతో గెలుపు

బెనోని(దక్షిణాఫ్రికా): అండర్‌-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో భారతజట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. సోమవారం యుఎఇ మహిళలతో జరిగిన పోటీలో భారత్ 122పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన షెఫాలీ వర్మ నేతృత్వంలోని భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టపోయి 219పరుగులు చేసింది. ఓపెనర్లు శ్వేత (74నాటౌట్; 49బంతుల్లో 10ఫోర్లు), షెఫాలీ (78; 34బంతుల్లో 12ఫోర్లు, 4సిక్సర్లు) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా మహిళలు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 5వికెట్లు నష్టపోయి 97పరుగులు చేయగల్గింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షెఫాలీ వర్మకు లభించింది.

తొందరొద్దు... మరింత చర్చ జరగాలి

- రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై రాజకీయ పార్టీలు
- లిఖితపూర్వక అభిప్రాయాలకు గడువు

31 నుంచి ఫిబ్రవరి 20 వరకు పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ (ఆర్ఇవి) వ్యవస్థతో ఓటు హక్కు కల్పించడంపై తొందరొద్దని, మరింత చర్చ జరగాలని రాజకీయ పార్టీలు స్పష్టం చేశాయి. సోమవారం నాడిక్కడ కానిస్టిట్యూషన్ క్లబ్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష పార్టీల నేతలతో భేటీ నిర్వహించింది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు అనుప్ చంద్ర పాండే, అరుణ్ గోయెల్, ఎనిమిది గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, 57 ప్రాంతీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. రిమోట్ ఓటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వస్తూ.. తీసుకున్న నిర్ణయంపై పార్టీల అభిప్రాయాన్ని ఇసి కోరింది. ఓటింగ్ శాతం పెంచడానికి ప్రధానంగా మారుమూల ప్రాంతాల నుంచి ఓటింగ్ శాతం పెంచడానికే ఈ వ్యవస్థ తీసుకొచ్చామని ఇసి తెలిపింది. ఓటింగ్ శాతం తక్కువ ఉండడానికి ప్రధాన కారణం వలస కార్మికులేనని, వలస కార్మికులకు వారున్న ప్రదేశంలో ఓటు హక్కు వేసే అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చామని తెలిపింది.

రెండు మూడు చిన్న పార్టీలు మినహా అన్ని రాజకీయ పార్టీలు కూడా రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరుపై అనుమానాలను వ్యక్తం చేశాయి. రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపకుండానే, నిర్ణయం తీసుకోకుండానే ఈ మిషన్లను తయారు చేశారని, ముందు రాజకీయ పార్టీల ఆలోచనలు వినాలని సమావేశంలో అన్ని పార్టీల ప్రతినిధులు స్పష్టం చేశారు.

రిమోట్ ఓటింగ్ యంత్రాన్ని ప్రవేశపెట్టాలన్న ఎన్నికల సంఘం ఆలోచనతో రాజకీయ పార్టీలు విభేదిస్తున్నాయి. చాలా రాజకీయ పార్టీలు వలస కార్మికుల నిర్వచనం, వారి సంఖ్య, రిమోట్ ఓటింగ్ యంత్రం పనితీరుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశాయి. సమావేశంలో రాజకీయ పార్టీలకు ఇసి డెమో ఏర్పాటు చేస్తూ షెడ్యూల్ చేసింది. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అనుమానాలతో ఇసి ఆర్ఇవి డెమోను సహితం వాయిదా వేసుకుంది.

కమిషన్ ఈ వ్యవహారంలో వేగం పెంచుతోందని, ఇలాంటి ఆలోచనతో ముందుకు వెళ్లాలంటే ముందుగా రాజకీయ పార్టీలతో చర్చించి ఉండాల్సిందని రాజకీయ పార్టీలు స్పష్టం చేశాయి. కానీ కమిషన్ అన్ని ప్రకటనలు చేసిన తరువాత, రాజకీయ పార్టీలను చర్చకు పిలిచారని అన్నాయి. "వలస కార్మికులకు అవకాశం రాకపోవడంతో ఓటింగ్ శాతం తగ్గుతోందని కమిషన్ అభిప్రాయంలో నిజం లేదు. ఎన్నికల సమయంలో చాలా మంది ఓటు వేయడం లేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల ప్రజలు ఓటు వేయడం లేదు. 30 కోట్ల మంది వలస కార్మికులు ఉన్నట్లు కమిషన్ గుర్తించడంతో మేము ఏకీభవించలేము. ఇంతమంది జాబితాలోకి ఎలా వచ్చారు? రాజకీయ పార్టీల మిగతా 2లో

గోదావరి బ్లాస్ట్ ఫర్నేస్‌-1లో హాట్ మెటల్ ఉత్పత్తి

'ఉక్కు' సంకల్పం

- బ్లాస్ట్ ఫర్నేస్‌-1లో అత్యుత్తమ ఉత్పాదన

ప్రజాశక్తి-విశాఖపట్నం

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించి తీరుతామని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఈ నిర్ణయానికి వ్యతిరేకిస్తూ దాదాపు రెండేళ్లుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నా, కేంద్ర వైఖరిలో ఇసుమంతైనా మార్పు కనపడటం లేదు. ఇంత ఒత్తిడిలోనూ కార్మికులు ఉత్పత్తిలో సత్తా చూపుతున్నారు. ప్రతి ఏడాది కొత్త రికార్డులను సృష్టిస్తూనే ఉన్నారు.

తాజాగా స్టీల్‌ప్లాంట్‌లోని గోదావరి బ్లాస్ట్ ఫర్నేస్‌-1 8100 టన్నుల రికార్డు హాట్‌మెటల్ ఉత్పత్తిని సాధించింది. బిఎఫ్-1 విభాగం ప్రారంభం నుంచీ ఒక్కరోజు ఉత్పాదనలో ఇదే అత్యుత్తమం. పండగపూట కూడా కార్మికులు ఉత్పత్తిలో తమ దృఢ సంకల్పాన్ని చాటిచెప్పారు. గత ఏడాది ఫిబ్రవరి 18న 8,019 టన్నుల అత్యధిక ఉత్పత్తిని కార్మికులు సాధించారు. అప్పటికి అదే అత్యధికం. తాజాగా చేసిన ఉత్పత్తితో గత రికార్డును అధిగమించారు. ఈ సందర్భంగా సిబ్బందిని సిఎండి అతుల్ భట్ అభినందించారు. ఇదే ఒరవడిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

అంతరాల అగాధం

- ఒక్క శాతం సంపన్నుల చేతుల్లో 40% సంపద
- 100 మంది వద్ద రూ.54.12 లక్షల కోట్లు
- కరోనా కాలంలో పెరిగిన శతకోటీశ్వరులు
- ఆక్స్‌ఫామ్ రిపోర్టులో వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. భారత్‌లో ఒక్క శాతం సంపన్నుల వద్ద 40.5 శాతం సంపద పోగుపడింది. మొత్తం సంపదలో 60 శాతం కేవలం 5 శాతం మంది వద్ద ఉంది. మరోవైపు దేశంలో అట్టుడుగున ఉన్న 50 శాతం మంది (సగం జనాభా) వద్ద కేవలం 3 శాతం సంపద పరిమితమయ్యింది. ఈ వివరాలతో పాటు ధనవంతుల వద్ద ఉన్న సొమ్ముతో ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి పరిష్కారాలు చూపవచ్చునో వివరిస్తూ స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫామ్ ఓ నివేదికను విడుదల చేసింది. దావోస్‌లో జనవరి 16 నుంచి 20 వరకు వరల్డ్ ఎకనమిక్స్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లోని తొలి రోజున కార్పొరేట్ల పెరుగుదల, కోరలు చాస్తోన్న పేదరికంపై ఆక్స్‌ఫామ్ 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్‌- ది ఇండియన్ స్టోరీ' పేరుతో ఓ రిపోర్టును విడుదల చేసింది. సోమవారం విడుదల చేసిన ఈ నివేదికలో అనేక విస్తు పోయే అంశాలు ఉన్నాయి. దేశంలో ధనవంతుల కంటే పేద ప్రజలే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారని తెలిపింది. కరోనా కష్టకాలంలోనూ దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య పెరిగిందని పేర్కొంది. ఫోర్బ్స్ క్రెడిట్ సూయిజ్, కేంద్ర గణంకాల శాఖ, కేంద్ర బడ్జెట్ పత్రాలు, పార్లమెంట్‌లో సభ్యుల ప్రశ్నలకు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ రిపోర్టును రూపొందించినట్లు ఆ సంస్థ తెలిపింది.

2020లో దేశంలో 102 మంది కుబేరులు (బిలియనీర్లు) ఉండగా.. 2022 ముగింపు నాటికి ఈ సంఖ్య 166కు చేరింది. 100 మంది కుబేరుల వద్ద రూ.54 లక్షల కోట్ల సంపద పోగుబడింది. ఈ మొత్తంతో కేంద్ర బడ్జెట్‌కు 18 నెలల పాటు కేటాయింపులు చేయవచ్చు. దేశంలోని టాప్ 10 మంది కార్పొరేట్ల వద్ద రూ.27.52 లక్షల కోట్ల సంపద ఉంది. 2021 నాటి సంపదతో పోల్చితే దాదాపు 9 లక్షల కోట్లు లేదా 32.8 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. కరోనా సంక్షోభం ప్రారంభమైన నాటి నుంచి 2022 నవంబరు వరకు దేశంలో బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది. రోజుకు దాదాపు రూ.3,608 కోట్ల సంపద పోగు చేసుకున్నారు.

"2019 కరోనా తర్వాత జనాభాలో దిగువన ఉన్న 50 శాతం మంది తమ సంపాదను కోల్పోయారు. మొత్తం సంపదలో వీరి వాటా 3 శాతం కంటే తక్కువగా ఉందని అంచనా. దీని ప్రభావం అనూహ్యంగా బలహీనమైన ఆహారం, అప్పులు, మరణాల పెరుగుదలకు కారణమయ్యింది. దేశంలోని మొత్తం 90 శాతం పైగా సంపద 30 శాతం మంది ధనవంతుల వద్ద ఉంది. 80 శాతం సంపద 10 శాతం మంది చేతుల్లో ఉంది. అగ్రశ్రేణి 5 శాతం మంది కుబేరులు మొత్తం సంపదలో దాదాపు 62 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఇది కరోనా ముందు నాటికంటే ఎక్కువ." అని ఈ రిపోర్టు తెలిపింది.

జిఎస్‌టితో ప్రజలపైనే దాడి..

2021-22లో దేశంలో వసూలైన రూ.14.83 లక్షల కోట్ల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ల్లో 64 శాతం రాబడి కూడా అట్టడుగున ఉన్న 50 శాతం మంది నుంచి వచ్చిందే. పన్నుల్లో మూడింట్ల ఒక్క వంతు మధ్య తరగతి వారి వాటా ఉంది. జిఎస్‌టి మొత్తం ఆదాయంలో కేవలం 3-4 శాతం మాత్రమే తొలి పది మంది కుబేరుల నుంచి వచ్చింది. అంటే పన్నుల రూపంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఏ స్థాయిలో బాదేస్తున్నారో ఈ రిపోర్టు స్పష్టం చేస్తోంది.

సంపన్నులపై పన్నులతోనే పరిష్కారం..

సంపన్నులపై పన్నులు వేయడం ద్వారా దేశంలోని అనేక సామాజిక సమస్యలకు పరిష్కారం చూపవచ్చని ఆక్స్‌ఫామ్ సూచించింది. ఆ వివరాలు.. భారత్‌లోని టాప్ 10 మంది కుబేరులపై 5 శాతం పన్ను విధిస్తే.. బడి మానేసిన పిల్లలందరినీ తిరిగి పాఠశాలలకు తీసుకురావచ్చు. లేదా తొలి 100 మంది బిలియనీర్లపై 2.5 శాతం పన్ను విధిస్తే ఆ పిల్లలను స్కూళ్లకు చేరువ చేయవచ్చు. మోడీ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత గౌతమ్ అదానీ సంపద రాకెట్‌లా దూసుకుపోయిన సంగతి తెలిసిందే. 2017- 2021 మధ్య పెరిగిన అదానీ సంపదపై కేవలం ఒక్క శాతం పన్ను విధిస్తే రూ.1.79 లక్షల కోట్ల నిధుల్ని సమీకరించవచ్చు. దీంతో ఏడాది పాటు దేశంలోని మిగతా 2లో

'బరి' తెగింపు

- యథేచ్ఛగా కోడిపందేలు, జూదాలు
- చేతులు మారిన వందల కోట్ల రూపాయలు!
- పోలీసుల ప్రేక్షకపాత్ర

కృష్ణా జిల్లా మొవ్వలో నిర్వహిస్తున్న కోడిపందెం

ప్రజాశక్తి- యంత్రాంగం

పోలీసుల ప్రేక్షకపాత్రతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కోడి పందేలు యథేచ్ఛగా సాగాయి. కొన్నిచోట్ల రాత్రి, పగలూ తేడా లేకుండా ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగాయి. గుండాట వంటి జూదక్రీడలకు అడ్డులేకుండాపోయింది. వందల కోట్ల రూపాయలు చేతులు మారాయి. కోడి పందేలకు కొందరి మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అడ్డుకోవాల్సిన పోలీసులు చేతులెత్తేస్తారు. కొన్నిచోట్ల తూతూమంత్రంగా దాడులు నిర్వహించారు. అటువంటి చోట్ల తిరిగి కొన్ని గంటల్లోనే పందేలు, మద్యం విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యాయి. సంక్రాంతి రోజు ప్రారంభమైన కోడి పందేలు కనుమ పండగ నాడు కూడా కొనసాగాయి. ముక్కనుమ రోజు కూడా వీటిని కొనసాగించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో రూ.200 కోట్లకు పైగా చేతులు మారాయి.

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సంక్రాంతి రోజున కోడి పందేలు, గుండాటలు విస్తృతంగా జరిగినా పోలీసులు నిలువరించలేదు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జార్జిపేటలో అతిపెద్ద బరిని ఏర్పాటు చేశారు. సినీ దర్శకులు రామ్‌గోపాలవర్మ ఈ బరిని సోమవారం సందర్శించారు. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విఐపి గాలరీలో కూర్చొని కోడి పందేలను కాసేపు తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు లేకుంటే సంక్రాంతి లేనట్టే అన్నట్టుగా గోదావరివాసులు భావిస్తారన్నారు. రామ్‌గోపాలవర్మతో పలువురు సెల్ఫీలు దిగారు. కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లోనూ 70కుపైగా బరులు, పేకాట శిబిరాలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ జిల్లా పందేలు జోరుగా సాగాయి. కొన్నిచోట్ల బరుల వద్ద, జూద శిబిరాల వద్ద వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలి, యలమంచిలి మండలం కలగడంపూడి, భీమవరం రూరల్, ఆకివీడు మండలాల్లో వేసిన బరుల్లో పందేలు కోట్లాది రూపాయాల్లో పందేలు సాగాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో అధికార పార్టీ నేతలకు చెందిన బరులవైపు, జిల్లాలోని పెద్ద బరుల వైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. కొన్ని చిన్నచిన్న బరులపై దాడులు చేసి గుండాట వంటి వాటిని అడ్డుకున్నారు. అధికార పార్టీ మిగతా 2లో

కోడి కత్తికి ఇద్దరు బలి

- పేకాట శిబిరంలో పాతగొడవల కారణంగా ఒకరి హత్య

● లోపలి పేజీల్లో.. ●

గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్

తెలంగాణ హైకోర్టుకు బదిలీ

- సుప్రీంకోర్టు తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్ విచారణను తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు బదిలీ చేసింది. గంగిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెయిల్ ఇస్తూ ఇచ్చిన తీర్పును సిబిఐ సవాల్ చేసింది. దీనిపై సోమవారం జస్టిస్ ఎంఆర్ షా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ఇచ్చింది. కేసు ట్రయల్‌ను తెలంగాణకు బదిలీ చేసిన నేపథ్యంలో మరోసారి విచారణ జరపడంతోపాటు బెయిల్ రద్దు అంశాన్ని కూడా తెలంగాణ హైకోర్టులో తేల్చాలని ఆదేశించింది. నాన్ బెయిలబుల్ నేరానికి పాల్పడిన సందర్భంలో చార్జిషీటు దాఖలు కాలేదన్న కారణంతో కేసులోని మెరిట్స్‌ను పరిగణలోకి తీసుకోకుండా డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడం తగదని తెలిపింది. మెరిట్స్ ఆధారంగా బెయిల్ అంశంపై మరోసారి విచారణ చేపట్టాలని సూచించింది. డిఫాల్ట్ బెయిల్ రద్దు కాదంటూ ఏపి హైకోర్టు తీర్పునివ్వడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. విచారణకు సహకరించకపోతే డిఫాల్ట్ బెయిల్ రద్దు చేసే అవకాశం ఉంటుందని పేర్కొంది.

జల్లికట్టులో విషాదం

- మదురైలో ఒకరి మృతి, 60 మందికి గాయాలు
- రంగంపేటలో పదిమందికి గాయాలు

ప్రజాశక్తి- మదురై, తిరుపతి బ్యూరో

సంక్రాంతి అనగానే తమిళనాడులో గుర్తుకు వచ్చే జల్లికట్టు క్రీడలో విషాదం చోటు చేసుకుంది. మదురై జిల్లా పలమేడు వద్ద జరిగిన ఈ జల్లికట్టులో ఒక యువకుడు మృతి చెందగా, 60మంది గాయపడ్డారు. వారిలో తీవ్రంగా గాయపడిన 11మందిని ప్రభుత్వ రాజాజీ ఆస్పత్రికి తరలించారు. మరో 40మందికి ప్రాథమిక చికిత్స చేసి ఇళ్లకు పంపివేశారని జిల్లా కలెక్టర్ అనీష్ శేఖర్ తెలిపారు. జల్లికట్టు సందర్భంగా సుమారు రెండు వేలమందికి పైగా పోలీసు బలగాలను మోహరించినట్లు చెప్పారు.

కనుమ పండుగ సందర్భంగా తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రంగంపేటలో సోమవారం జరిగిన జల్లికట్టులో పదిమంది యువకులకు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. జల్లికట్టు సంబరాల్లో భాగంగా పశువులను నిలువరించి, వాటి కొమ్ములకు ఉన్న బహుమతులను చేజిక్కించుకొని ప్రయత్నంలో యువకులు గాయపడ్డారు. సుమారు 200 మంది పోలీసులు రంగంపేటలో భద్రత కల్పించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని హాజరయ్యారు.

రోడ్‌షోలో ప్రధాని మోడీ

9 రాష్ట్రాల ఎన్నికలపై గురి

బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో నడ్డా

న్యూఢిల్లీ : ఈ ఏడాది జరిగే తొమ్మిది రాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధించాలని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 9 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు వ్యూహాలను రూపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సోమవారం ఇక్కడ ఎన్‌డిఎంసి కన్వెన్షన్ సెంటర్‌లో రెండు రోజుల బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బిజెపి ఇప్పటివరకూ లక్షా 30 వేల పోలింగ్ బూత్‌లలో బలంగా ఉందని, బలహీనంగా ఉన్న 72 వేల పోలింగ్ బూత్‌లను బలోపేతం చేయాలని అన్నారు. ఈ సమావేశాలకు 35 మంది కేంద్ర మంత్రులు, 12 మంది సిఎంలు, ఐదుగురు డిప్యూటీ సిఎంలు, అన్ని రాష్ట్రాల బిజెపి అధ్యక్షులు సహా 350 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముందు జాతీయస్థాయిలో ఆఫీసు బేరర్ల సమావేశం కూడా జరిగింది.

మోడీ మెగా రోడ్ షో

ఈ సమావేశాలకు ముందు ప్రధాని మోడీ ఢిల్లీలో పెద్ద ఎత్తున రోడ్ షో నిర్వహించారు. పటేల్ చౌక్ నుంచి ప్రారంభమైన రోడ్ షో పొడవునా మోడీ భారీ కటౌట్లు కనిపించాయి. ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల వివరాలను తెలియచేసేలా అనేక పోస్టర్లు వెలిశాయి. పలుచోట్ల వివిధ రాష్ట్రాల జానపద కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించారు.

కొలిజియంలో కేంద్ర ప్రతినిధుల్ని చేర్చాలి

- సిజెఐకి కిరణ్ రిజిజు లేఖ

న్యూఢిల్లీ : న్యాయమూర్తులుగా కొలిజియం పునరుద్ఘాటించిన సిఫారసులను సైతం ఎటువంటి కారణం లేకుండానే పక్కన పెడుతున్న కేంద్రం న్యాయవ్యవస్థ స్వతంత్రతను ప్రశ్నార్థకం చేసేలా అడుగులు వేస్తోంది. న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియలో హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంలో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చుకోవాలని కేంద్ర న్యాయశాఖమంత్రి కిరణ్‌రిజిజు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాశారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన రాజ్యాంగ ప్రక్రియలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలంటూ రిజిజు కొత్త వాదానికి తెరలేపారు. కేసులు పేరుకుపోవడానికి కొలీజియం వ్యవస్థే కారణమంటూ రిజిజు తరచూ వ్యాఖ్యానిస్తున్నారు. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి)ని కొట్టేయడం ద్వారా పార్లమెంటు సార్వభౌమత్వాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చిందని ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖర్ ఇటీవల వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు స్వతంత్రతను దెబ్బతీసి, ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేయించుకోవాలన్న వ్యూహంలో భాగంగానే మంత్రి, ఉపరాష్ట్రపతితో బిజెపి, ఆర్ఎస్ఎస్ వ్యాఖ్యలు చేయిస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేదా!

- విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.150 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీల ఏర్పాటుకు డిపిఆర్ సిద్ధం
- ఫింగర్ జెట్టీలే కావాలంటున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.150 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఆధునీకరణ పనుల పేరుతో వేలాడే జెట్టీలను నిర్మించి ప్రమాదాలుగనక చోటుచేసుకుంటే ఆ వంకతో అక్కడ నుంచి శాశ్వతంగా మత్స్యకారులను తరలించే ఆలోచన దీని వెనుక ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫింగర్ జెట్టీలు నిర్మించాలని మత్స్యకారులు కోరుతుండగా ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణానికి డిపిఆర్ సిద్ధమైంది. దీనిపై మత్స్యకారుల అభిప్రాయాలు తీసుకోకుండానే కేంద్ర, రాష్ర ప్రభుత్వాలు ముందుకు వెళ్లాలని చూస్తున్నాయి. దీనివల్ల తమకు ఉపయోగం ఉండదని మత్స్యకారులు చెప్తున్నారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 11 జెట్టీలు ఉన్నాయి. ఇవి మత్స్యకారులకు ఎంతోగానే ఉపయోగపడుతున్నాయి. పెరిగిన అవసరాల దృష్ట్యా ఇవి చాలడం లేదు. దీంతో, కొత్త జెట్టీల నిర్మాణం తెరపైకి వచ్చింది. అప్పట్లో రూ.40 కోట్లతో డిపిఆర్ తయారైంది.గత టిడిపి ప్రభుత్వం రూ.23 కోట్లకు పాలనా ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్రం ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒత్తిడి చేయకపోవడంతో ఆచరణ రూపం దాల్చలేదు. కేంద్రంలో అధికారంలోన్న బిజెపి ప్రభుత్వం జెట్టీల విషయంలో తన విధానాన్ని మార్చుకుంది. ఫ్లోటింగ్ జెట్టీల నిర్మాణంపై వైపు మొగ్గు చూపుతోంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక 2019లో వీటిపై మళ్లీ చర్చ మొదలైంది. అప్పటి కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి గిరిధర్ సింగ్ విశాఖ హార్బర్‌కు విచ్చేసి రూ.100 కోట్లతో ప్రణాళికలు తయారు చేసి వెళ్లిపోయారు. కానీ, ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఈలోగా 2022లో ఈ డిపిఆర్ రూ.150 కోట్లకు ఎగబాకింది. విశాఖ ఫిషింగ్ హార్బర్ పక్కనే ప్రయివేట్ విసిటిపిఎల్ విస్తరణ బెర్తు ఏర్పాటు కావడంతో ప్రయివేట్ వ్యాపారుల లాభార్జనే ధ్యేయంగా ఫింగర్ జెట్టీకి కాకుండా ఫ్లోటింగ్ జెట్టీ దిశగా పాలకులు అడుగులు వేస్తున్నారు. 20 ఏళ్లుగా ఒక్క వెసెల్‌ను కూడా తీయడానికి కృషి చేయలేదు.



ఫ్లోటింగ్ జెట్టీ నమూనా

మత్స్యకారులు ఎలాంటి ఆధునీకరణ కోరుతున్నారు

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 700 వరకూ మెకనైజ్డ్ (ఆధునిక బోట్లు), మరో మూడు వేల వరకూ చిన్నచిన్న బోట్లూ ఉన్నాయి. మొత్తంగా 15 వేల మంది మత్స్యకారులు ఈ హార్బర్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు, కోల్డ్ స్టోరేజీ, శానిటేషన్ అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నారు. 200 బోట్ల కోసం మాత్రమే గతంలో 11 జెట్టీలను నిర్మించారు. ఓ వైపు బోట్లు సంఖ్య పెరుగుతున్నా జెట్టీల సంఖ్య పెరగలేదు. మరోవైపు ఉన్న జెట్టీల్లో కొన్నింటిపై కోస్ట్‌గార్డ్‌ల పెత్తనం ఉండడంతో మత్స్యకారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో బోట్ల నిలుపుదలకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలాభావం పెద్ద సమస్యగా మారింది. మత్స్యసంపదను సముద్రం నుంచి వేగంగా తెచ్చుకుని అమ్ముకోవడం, రవాణాకు అనువుగా ఉండేలా ఆధునీకరణ జరగాలని, కొత్తగా ఫింగర్ జెట్టీలు నిర్మించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. ఫ్లోటింగ్ జెట్టీలతో సమస్యలు తలెత్తనున్నాయని, దీనిపైకి 30 మంది మత్స్యకారులు వెళితే జెట్టీ మునిగిపోవడం ఖాయమని మత్స్యకార సంఘం నాయకులు చంద్రశేఖర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఫింగర్ జెట్టీపైకి వందమంది వెళ్లినా ఏమీకాదని పేర్కొన్నారు. కనీసం బోట్ల యజమానులతో సమావేశం నిర్వహించి ఫ్లోటింగ్ హార్బర్ జెట్టీపై అభిప్రాయం తీసుకోలేదని ఆయన అంటున్నారు.

ఇక ప్రతి నెల విద్యుత్ ఛార్జీల పెంపు

- కొత్త నిబంధనలతో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపేందుకు కేంద్రప్రభుత్వం కొత్తకొత్త నిబంధనలు తీసుకొస్తుంది. విద్యుత్ చట్టసవరణ బిల్లు-2020కు పార్లమెంట్ ఆమోదం పొందకపోయినా దొడ్డిదారిలో భారాలు మోపుతోంది. ప్రతి నెల ట్రూఅప్ భారం ప్రజలపై మోపేందుకు కొత్త నిబంధనను కేంద్రప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ మేరకు విద్యుత్ నిబంధన చట్టం-2005లోని నిబంధనలు మారుస్తూ కేంద్ర విద్యుత్మంత్రిత్వ శాఖ డిసెంబర్ 29వ తేదితో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తన వెబ్‌సైట్‌లో ఆలస్యంగా పొందుపరిచింది. ఈ నోటిఫికేషన్‌లో ట్రూఅప్ భారాన్ని నెలనెల వసూలు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్ట్‌మెంట్ సర్‌చార్జ్(ఎఫ్‌పిపిఎస్) పేరుతో దీనిని అమలు చేయాలని కేంద్రం పేర్కొంది. ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుతున్నట్లే ఇక కరెంట్ చార్జీలు నెలకొక్కసారి పెరుగుతుందన్న మాట. ప్రస్తుతం డిస్కంలు మూడు నెలలకోసారి చేసిన ఖర్చు ఆదాయంలో రాకపోతే ట్రూఅప్ భారాలు వేసేందుకు అనుమతి ఇవ్వాలని ఇఆర్‌సికి ప్రతిపాదిస్తున్నాయి. డిస్కంల ప్రతిపాదనపై ఇఆర్‌సి బహిరంగ విచారణ నిర్వహించి ట్రూఅప్ భారం వేయాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకుంటుంది. ఇప్పటికే 2021-22కి చివరి త్రైమాసికానికి సంబంధించిన ట్రూఅప్ భారం రూ.1,048కోట్లు ప్రస్తుతం ఎపిఇఆర్‌సి వద్ద పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు బొగ్గు ధరలు, విద్యుత్ కొనుగోలు ధర, ట్రాన్స్‌మిషన్ ధరలు పెరిగిన ప్రతిసారి వీటిని వసూలు చేసుకోవచ్చునని తెలిపింది. ఈ ట్రూఫ్ చార్జీలు ప్రజలపై మోపేందుకు విద్యుత్ నియంత్రణ మండలి(ఇఆర్‌సి)ని సంప్రదించాల్సిన అవసరం కూడా లేదని పేర్కొంది. దీంతో ఇక నుంచి ప్రతి నెల వినియోగదారులకు తెలియకుండానే భారాలు పడనున్నాయి.

అయితే ప్రస్తుతం ప్రతి నెల ట్రూఅప్ వసూలు చేసేందుకు అవసరమైన విధానం, తగిన సిబ్బంది లేరని డిస్కంకు చెందిన సీనియర్ అధికారి తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థలు విద్యుత్ నిల్వ ఉంచే విధానం(ఎనర్జీ స్టోరేజ్ సిస్టం) ఏర్పాటు చేసుకోవాలని కూడా కేంద్రం నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే ఈ విధానం చాలా ఖర్చుతో కూడుకున్నది. గతంలోనే ఈ విధానంపై రాష్ట్ర ఇంధన శాఖ ఆలోచన చేసింది. ఈ విధానం వల్ల విద్యుత్ యూనిట్‌కు సుమారు రూ.20లు ఖర్చు అవుతుందని అంచనా వేయడంతో వెనక్కి తగ్గింది.

ఉద్యోగులకు కొత్త డిఎ ఏదీ?

- సంక్రాంతికి ఉంటుందన్న హామీనిచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్రప్రభుత్వం రెండు డిఎలు ప్రకటించాల్సి ఉంది. వీటిల్లో సంక్రాంతికి ఒకదానిని ప్రకటిస్తామని రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల జెఎసికి హామీ ఇచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల జెఎసి నాయకులకు ఈ విషయం తెలిపారు. దీంతో సంక్రాంతికి కొత్త డిఎ రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తుందని ఆశతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూశారు. పండుగ ముగిసిన తరువాత కూడా డిఎపై ఎటువంటి ప్రకటన లేకపోవడంతో వారు నిరాశ చెందారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిఎ ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కొత్త రెండు డిఎల్లో ఒక డిఎను సంక్రాంతి సందర్భంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ఎపిజెఎసికి హామీ ఇచ్చారని, దీనిని నిలబెట్టుకోవాలని కోరుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం పాత ఏడు డిఎల బకాయిలను చెల్లించలేదని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. అయినా తమ ఖాతాల్లో నగదు జమచేసినట్లు చూపడంతో ఆదాయపు చెల్లించాల్సి వస్తోందన్నారు.

కొత్తగా ప్రకటించాల్సిన రెండు డిఎల్లో సంక్రాంతికి ఒక దానిని ప్రభుత్వం ప్రకటిస్తుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆశించారని తెలిపారు. పాత డిఎ బకాయిలను విడుదల చేయాలని, పెండింగ్‌లో డిఎ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటిస్తానని హామీ ఇచ్చిన డిఎను ప్రకటించాలని ఎపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి హృదయరాజు కోరారు. గతంలో కూడా ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి నెరవేర్చలేదన్నారు. ఇది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో అశాంతిని కలిగించే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం దీర్ఘకాలంగా డిఎలు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మూకల అప్పారావు, నడిపినేని వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే జాప్యం లేకుండా రెండు డిఎలు విడుదల చేయాలని కోరారు. డిఎ ఉద్యోగి హక్కు అని పేర్కొన్నారు.

2024 సెప్టెంబర్ నుంచి సెకీ విద్యుత్

- మొదటి దశలో 3వేల మెగావాట్లు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి విద్యుత్ సరఫరా 2024 సెప్టెంబర్‌లో అందుబాటులోకి వస్తుందని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. వ్యవసాయ రంగ విద్యుత్ సరఫరాపై విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) నుంచి 7వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్ రూ.2.29ల చొప్పున కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి గుర్తుచేశారు.ఇందులో భాగంగా 2024 సెప్టెంబర్ నుంచి మొదటి విడతలో 3వేల మెగావాట్లు, 2025లో రెండో విడతలో మరో 3వేల మెగావాట్లు, 2026లో మూడో విడతలో మరో 1000 మెగావాట్లు చొప్పున విద్యుత్ సరఫరా ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ పథకం వ్యవసాయానికి లాభసాటిగా మారిందని, రైతులకు భరోసా కల్పించిందని తెలిపారు. భవిష్యత్తులో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకాన్ని శాశ్వతంగా చేయాలనుకుంటుందని చెప్పారు. డిస్కంల పనితీరును మెరుగు పరచడానికి, వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్రప్రభుత్వం నేరుగా నగదు బదిలీ పథకం(డిబిటి) అమలు చేస్తోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ప్రస్తుతం డిస్కంలు వ్యవసాయానికి ఏడాదికి 12వేల మిలియన్ యూనిట్లు (ఎంయు) చొప్పున సరఫరా చేస్తున్నాయని, దీనికోసం ప్రభుత్వం రూ.8,400కోట్ల సబ్సిడీని భరిస్తోందని వివరించారు. డిబిటి కింద శ్రీకాకుళం జిల్లాలో 28,684 వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లను అమర్చినట్లు తెలిపారు. చెల్లింపులు సకాలంలో అందకపోయినా రైతులకు డిస్కంలు ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. డిబిటి కింద 16,67,389 వ్యవసాయ కనెక్షన్లలో 16,38,650 కనెక్షన్ల కోసం బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు వివరించారు. 6,770 ఫీడర్లలో 6652 ఫీడర్లు ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలతో 9 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫఆ చేయగలవని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎండి బి శ్రీధర్, ట్రాన్స్‌కో జెఎండి ఐ పృథ్వీతేజ్, డిస్కంల సిఎండిలు కె సంతోషరావు, జె పద్మజనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డీ.. అరాచకాలు మానుకో

- నేను వెళ్లే ప్రతి చోటా 30 యాక్ట్ ఉపయోగిస్తారా?
- పీలేరులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-పీలేరు (అన్నమయ్య జిల్లా)

పెద్దిరెడ్డి ఇకనైనా నీ అరాచకాలు మానుకో, నిన్నూ, నీ పార్టీ జెండాను పాతడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అన్నమయ్య జిల్లా పీలేరు సబ్‌జైలులో ఉన్న పుంగనూరు టిడిపి కార్యకర్తలను సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం జైలు బయట ఆయన మీడియాతో మాట్లాడారు. తన పర్యటన జరిగే ప్రతి చోటా పోలీసులు 30 యాక్టును ప్రయోగిస్తున్నారని తెలిపారు. తాను మాట్లాడటానికి మైకు కూడా లేకుండా సీజ్ చేశారని అన్నారు. ఈ నెల 6న వైసిపి గూండాలు టిడిపి ఫ్లెక్సీలను చించివేస్తుంటే పోలీసులు ఏంచేస్తున్నట్లని ప్రశ్నించారు. ఫ్లెక్సీల గొడవలో తమ వారికి సంబంధంలేకపోయినా 13 మందిపై అక్రమ కేసులు పెట్టారన్నారు. వారిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి జైలులో ఉంచారని తెలిపారు. ఏం తప్పు చేశారని తమ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబరు 4న పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్ సదుంలో రైతుభేరీ నిర్వహించడానికి హైకోర్టు నుంచి అనుమతి తెచ్చు కున్నా స్థలం ఇవ్వలేదన్నారు. అదే రోజు రాత్రి 200 మంది వైసిపి గూండాలు అతని ఇంటిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. డిసెంబర్ 25న పెద్దిరెడ్డి పర్యటన సందర్భంగా తన ఇంటిపై బ్యానర్లు కట్టవద్దన్న న్యాయవాది నవీన్ కుమార్‌పై పెద్దిరెడ్డి గుండాలు వచ్చి దాడికి యత్నించారని ఆరోపించారు. ఈ నెల 2న చౌడేపల్లి మండల పార్టీ అధ్యక్షులు రమేష్‌కుమార్‌రెడ్డి తన ఇంటి ముందు వైసిపి తోరణాలు తొలిగించాలన్నందుకు 49 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు పెట్టించారన్నారు. జనవరి 3న చౌడేపల్లి మండలం గంగాపురానికి చెందిన టిడిపి కార్యకర్త రెడ్డెప్పకు చెందిన 1.5 ఎకరాల భూమిని వైసిపి వారు హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. ఏం తప్పు చేశారని టిడిపి కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పోలీసులను పహారా పెట్టి కోడి పందేలు నడుపుతున్నారని విమర్శించారు. పక్కరాష్ట్రాల నుంచి మద్యం తెప్పించి అమ్ముతున్నారని, దీనికంతటికీ పెద్దిరెడ్డే కారణమని ఆరోపించారు. పెద్దిరెడ్డి పనైపోయింది.. బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పోలీసు తీరుపై కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఆయన వెంట టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఎమ్ఎల్‌సి దొరబాబు, ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ యాదవ్, సుగుణమ్మ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు సబ్ జైలు వద్ద మాట్లాడుతున్న చంద్రబాబు

కుప్పంలో చంద్రబాబు ఓటమి తథ్యం : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కుప్పంలో చంద్రబాబు ఓటమి తథ్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లాలో చంద్రబాబు కారుకూతలు కూస్తున్నారని, తన జెండాను మోయలేక పవన్‌కల్యాణ్ చేతికి ఇచ్చారని విమర్శించారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలను గుండాలుగా మార్చి రెచ్చగొట్టే నీచానికి చంద్రబాబు దిగజారాడరని ఆరోపించారు. చివరికి న్యాయమూర్తులపైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కుటిల రాజకీయనైజం చాటుకున్నారని విమర్శించారు. పండగ సందర్భంగా పిల్లాజెల్లలతో సంతోషంగా ఉంటే, తమపై రోజూ ఏదోఒక కారుకూతలు కూస్తున్నారని అన్నారు. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపిన విషయం, అంగన్‌వాడీ మహిళలను గుర్రాలతో తొక్కించిన విషయాన్ని జనం మరచిపోలేదని పేర్కొన్నారు. పుంగనూరులో తనపై చంద్రబాబు పోటీ చేయాలని సవాల్ విసిరారు. సిఎం అనుమతిస్తే కుప్పంలో పోటీ చేస్తానని తెలిపారు. జిఒ నంబర్ 1 ముందే వచ్చి ఉంటే 11 మంది చనిపోయి ఉండేవారు కాదని అన్నారు. ప్రజల భద్రత కోసమే ఈ జిఒ తెచ్చామని సమర్థించుకున్నారు.

పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపికను పల్నాడు జిల్లా సత్తెనపల్లి పవర్ హౌస్ ఫిట్నెస్ సెంటర్‌లో సోమవారం చేపట్టారు. ఎంపికైన క్రీడాకారులు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 15 నుంచి 20 తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి పసుపులేటి సురేష్ తెలిపారు. జూనియర్ విభాగం నుండి ఎం.రాహుల్‌గౌతం (ప్లస్ 120 కిలోలు), ఎం.అనూష (47 కిలోలు), సీనియర్ విభాగం నుండి ఎస్‌కె నజీర్ (83 కిలోలు) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు జిమ్ము రాజు, జి.ఆనంద్, జి.రమేష్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, ఎం.మధన్, ఎస్‌కె.జాని, సయ్యద్ మస్తాన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.సాంబశివరావు, శాంతయ్య పర్యవేక్షించారు.

'బరి' తెగింపు

మొదటి పేజీ తరువాయి

నేతల జోక్యంతో ఆ తర్వాత కోడిపందాలు, జూదం యథేచ్ఛగా సాగాయి. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరంలో జరిగిన కోడిపందేలను తెలంగాణ రాష్ట్రం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కోడి పందేల సంప్రదాయం ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతోందన్నారు. ఈ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా స్నేహం ఎప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉంగులూరు మండలం నారాయణపురం రాజుల బరిలో బుల్లెట్ బండిని డ్రా తీసి విజేతలకు ఇవ్వనున్నారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోన కోడిపందాలు జోరుగా జరిగాయి. ప్రకాశంలో జిల్లా పిసిపల్లి, యంద్రగొండపాలెం, బాపట్ల బాపట్ల జిల్లా కర్లపాలెం మండలాల్లో పలుచోట్ల పోలీసులు దాడుల నిర్వహించి కోడి పుంజులను, నగదును స్వాధీనం చేసుకున్నారు.

కోడి కత్తికి ఇద్దరు బలి

- పేకాట శిబిరంలో పాతగొడవల కారణంగా ఒకరి హత్య

పద్మారావు

సూర్యప్రకాశరావు

కోడికత్తి తగిలి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఒకరు, కాకినాడ జిల్లాలో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. పాత కక్షల కారణంగా పేకాట శిబిరం వద్ద కృష్ణా జిల్లాలో యువకుడు హత్యకు గురయ్యారు. ఏలూరు జిల్లా కొత్త ఉంగుటూరులో కోడిపందేల బరిలో జూదరుల మధ్య కొట్లాట చోటు చేసుకోవడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలోని పామాయిల్ తోటలో ఆదివారం నిర్వహించిన కోడిపందేలను చేసేందుకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన పిరిగిన పద్మారావు(19)కు కోడికి కట్టిన కత్తి తగిలి తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. నల్లజర్ల ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంకిలో కోడి కత్తి తగిలి అదే గ్రామానికి చెందిన గండే సూర్యప్రకాశరావు (43) మృతి చెందాడు. కృష్ణా జిల్లా అవనిగడ్డ సమీపంలో పేకాట బరిలో జూదరుల మధ్య జరిగిన వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. సీతాయిలంకకు చెందిన మేడికొండ అనిల్ (వందగాడు)పై పాతకక్షలతతో కత్తులు, రాడ్లతో ప్రత్యర్థులు దాడి చేశారు. విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గుంటూరు జిల్లా గోరికపర్రుకు చెందిన నాగరాజు (కత్తులోడు)కు, అనిల్‌కి మధ్య గతంలో జరిగిన గొడవల కారణంగానే ఈ హత్య జరిగినట్లు సమాచారం.

మౌలిక వసతులతో టిడ్కో ఇళ్ల కేటాయింపు

- సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని టిడ్కో ఇళ్లకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించి, తక్షణం లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈనెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యాన టిడ్కో ఇళ్ల కోసం ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడ్కో ఇళ్లు వున్న ప్రాంతాలన్నింటిలో లబ్ధిదారులతో సమావేశాలు జరిపి వారి సంతకాలతో ప్రభుత్వానికి వినతి పత్రాలను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీలలో నివాసయోగ్య ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారునికి మూడు సెంట్ల స్థలం కేటాయించి, గృహనిర్మాణాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలను ప్రభుత్వం కేటాయించాలని కోరారు.

వడ్డీల పేరుతో రూ.3 కోట్లకు కుచ్చుటోపి

పరారీలో ఫిజియోథెరపిస్టు

ప్రజాశక్తి-అనంతపురం

వడ్డీల పేరుతో నమ్మించి రూ.మూడు కోట్లు కుచ్చుటోపి పెట్టి ఫిజియోథెరపిస్టు పరారయ్యాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా రఘువీర ప్రసాద్ అనే వ్యక్తి ఫిజియోథెరపీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. దీంతో పాటు రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ వ్యాపారం చేసేవాడు. ఇందుకు గాను వడ్డీలకు రూ.మూడు కోట్ల వరకు అప్పుచేశాడు. రఘువీర ప్రసాద్ తల్లి విశ్రాంత ఉపాధ్యాయురాలు కావడం, అక్కలు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ఆయన్ను నమ్మి పలువురు డబ్బు అప్పుగా ఇచ్చారు. వ్యాపారంలో నష్టం పేరుతో అప్పు ఇచ్చిన వారందరికీ లాయర్ నుంచి రఘువీర ప్రసాద్ ఐపి నోటీసులు పంపాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ధర్మ వడ్డీకి డబ్బు అప్పు ఇస్తే ఐపి నోటీసులు పంపి తమను మానసిక వేదనకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ఇలాంటివారిని న్యాయస్థానం కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం రఘువీర ప్రసాద్ కుటుంబం పరారీలో ఉన్నట్లు చెప్తున్నారు.

మారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించడంపై 15లోగా కేంద్రం స్పందించాలి : సుప్రీం

న్యూఢిల్లీ : వైవాహిక బంధంలో అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలని కోరుతూ పలు పిటిషన్లు వచ్చిన నేపథ్యంలో వాటిపై స్పందించాల్సిందిగా సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం కోరింది. ఫిబ్రవరి 15కల్లా దీనిపై స్పందన తెలియజేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ పిటిషన్లపై తుది విచారణ మార్చి 21 నుండి ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ అంశంపై ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన విభజన తీర్పుకు సంబంధించి కూడా ఒక పిటిషన్ దాఖలైంది. ఢిల్లీ హైకోర్టుకు వెళ్లిన పిటిషనర్లలో ఒకరైన ఖుష్బూ సైఫినే ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతేడాది మే 11న ఢిల్లీ హైకోర్టు బెంచ్ ఈ విషయంలో ఏకాభిప్రాయంతో కూడిన తీర్పు ఇవ్వలేదు. ఈ విషయంలో తేల్చాల్సిన కొన్ని ప్రశ్నలు వున్నందున సుప్రీంను ఆశ్రయించే విషయంలో ఢిల్లీ హైకోర్టు బెంచ్‌లోని ఇరువురు న్యాయమూర్తులు అంగీకరించారు. భార్యకి ఇష్టం లేకపోయినా బలవంతంగా తన శారీరక వాంఛ తీర్చుకున్నందుకు ఆ వ్యక్తిని ప్రాసిక్యూట్ చేయాలని కర్ణాటక హైకోర్టు తీర్పు ఇచ్చింది. దానిపై మరో వ్యక్తి పిటిషన్ దాఖలు చేశాడు. ఇలా ఈ అంశంపై పలు పిటిషన్లు దాఖలవడంతో సుప్రీం వాటిని విచారించనుంది.

కాలిఫోర్నియాలో తుపాన్ బీభత్సం..

- 19మంది మృతి

కాలిఫోర్నియా : అమెరికా కాలిఫోర్నియాలో తుపాన్ బీభత్సం సష్టించింది. దీంతో కాలిఫోర్నియాలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎమర్జెన్సీని ప్రకటించారు. కొన్ని వారాలుగా తుపాన్‌తో, భారీ వర్షాలతో కాలిఫోర్నియా ప్రజలు తల్లడిల్లి పోతున్నారు. కాలిఫోర్నియాలో భారీ విపత్తు చోటు చేసుకున్నదని జో బైడెన్ ప్రకటించారు. తుఫాన్ కారణంగా సంభవించిన వివిధ ప్రమాదాల్లో మొత్తం 19 మంది చనిపోయినట్లు శ్వేతసౌధం అధికారిక ప్రకటనలో తెలిపింది.

ముప్పు ఉంది.. ప్రయాణం ప్రమాదకరం : జాతీయ వాతావరణ సర్వీస్

కాలిఫోర్నియాను భారీ చలిగాలులు చుట్టుముడుతున్నాయని, భారీగా కురుస్తున్న వర్షాలతో మట్టి చరియలు విరిగి పడే ముప్పు ఉందని జాతీయ వాతావరణ సర్వీస్ తెలిపింది. కాలిఫోర్నియా నుంచి కొలొరెడో వరకు పర్వత శ్రేణుల నుంచి భారీగా మంచు కురుస్తుండటంతో ప్రయాణం ప్రమాదకరం అని హెచ్చరించింది.

మూడంతస్తుల ఎత్తులో ఎగసిపడుతోన్న అలలు...

భారీ వర్షాలతో వరదలు ముంచెత్తాయి. డ్యాములు పొంగిపొర్లాయి. చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు వాగులను తలపిస్తున్నాయి. వందలాది ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వేలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శీతకాల వర్షాల ధాటికి కాలిఫోర్నియాలో వరదలతోపాటు కొండచరియలు విరిగిపడ్డాయి. చాలాచోట్ల భూమికి పగుళ్లు వచ్చాయి. వరద నీరు లోతట్టు ప్రాంతాల్లో ప్రయాణిస్తున్నది.

కేంద్రం వెనక్కి తగ్గే వరకు పోరాటం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గేవరకూ పోరాడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంనాటికి 704వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎఫ్ఎండిఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, జనరల్ హాస్పిటల్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటంలో పండుగ రోజు కూడా కార్మికులు తమ నిరసన తెలియజేయడం పోరాటపటిమకు నిదర్శనమని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నప్పుడే ఉద్యోగులకు నిజమైన పండుగ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేంతవరకు ఉద్యోగులు అలుపెరగని పోరాటం చేస్తారని తెలిపారు. ఇప్పటికే ఉద్యమం రాష్ట్ర వ్యాప్తమై అనేక కార్మిక సంఘాలకు స్ఫూర్తిదాయకంగా మారిందన్నారు. ప్రభుత్వ రంగం ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని కేంద్రంలోని మోడీ సర్కారు గుర్తించి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

భారీగా మద్యం అమ్మకాలు

- రానున్న సంవత్సరానికి ప్రభుత్వ లక్ష్యం రూ.17,784 కోట్ల ఆదాయ అంచనా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రానున్న ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలను భారీగా పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.17,784 కోట్ల ఆదాయాన్ని మద్యం విక్రయాల ద్వారా పొందాలని ఆ శాఖ ప్రతిపాదించింది,. ఇది ప్రస్తుత సంవత్సరం లక్ష్యం కన్నా రూ.1285 కోట్లు అదనం. కొత్త లక్ష్యాన్ని సాధిస్తామని కూడా ఆ శాఖ అధికారులు గట్టిగానే చెబుతున్నారు. మద్యం విక్రయాలను తగ్గిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చెబుతున్నప్పటికీ, అమ్మకాలు, ఆదాయం మాత్రం ఏటా పెరిగిపోతూనే ఉన్నాయి. ఎన్నికలకు ముందు ఇదే చివరి బడ్జెట్ కావడంతో ఈసారైనా దుకాణాల కుదింపుపై నిర్ణయం ఉంటుందేమోని భావించినప్పటికీ, అబ్కారీ శాఖ మాత్రం గత ఏడాది కన్నా ఎక్కువ ఆదాయాన్ని ప్రతిపాదించింది.

కేంద్రం ఒత్తిడి మేరకేనా?

ఇటీవల కేంద్రం రాసిన ఒక లేఖలో మద్యం ఆదాయం ఆశించిన స్థాయిలో లేదని చెప్పడం గమనార్హం. దీనిని మరింతగా పెంచుకోవాలంటూ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఆదాయాన్ని పెంచి ప్రతిపాదించడం విశేషం. ప్రస్తుతం కొనసాగుతున్న సంవత్సరంలో 16,499 కోట్లు ప్రతిపాదించగా, మార్చి నెలాఖరు వరకు 16,167 కోట్లు చేతికందుతుందని తాజాగా అంచనా వేశారు. ఇక వ్యయం మాత్రం చాలా తక్కువగా ఉంది. 2022-23లో నిర్వహణ వ్యయంగా 140 కోట్లు ప్రతిపాదించగా, వచ్చే బడ్జెట్‌లో 205 కోట్లు కావాలని ప్రతిపాదిస్తున్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం అమ్మకం కేంద్రాలు మొత్తం 3. 880గా ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు ఇవే కొనసాగుతాయని ఎక్సయిజ్ అధికారులు చెబుతున్నారు. ఇందులో రిటైల్ ఔట్‌లెట్లు 2,934 ఉండగా, బార్లు 840, మైక్రో బ్రూవరీస్ ఎనిమిది, క్లబ్బులు 20, పర్యాటక అనుమతులు 35, సిఎస్ అనుమతులు 43 ఉన్నాయి.

విహార యాత్రలో విషాదం

- నీటిలో పడి నలుగురు యువకులు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా కోటిపల్లి ప్రాజెక్టులో నలుగురు యువకులు గల్లంతై మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన రాజేష్ (24), జగదీష్ (24), వెంకటేష్ (25), లోకేష్ (28) సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోటిపల్లి ప్రాజెక్టులో సరదాగా విహారయాత్రకు వెళ్లారు. అక్కడ గుంత ప్రాంతం, బురద ఉండడంతో నలుగురు గల్లంతు అయ్యారు. ఇద్దరికీ ఈత వచ్చినప్పటికీ, బురదలో ఇరుక్కు పోవడం కారణంగా ఒకరిని కాపాడబోయి మరొకరు అలా నలుగురు గల్లంతైనట్టు తెలుస్తుంది. ఘటనా స్థలానికి చేరుకున్న దారూర్ పోలీసులు స్థానికుల సహాయంతో నలుగురిని వెలికితీసి, వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టరలు తెలిపారు. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే ఆనంద్ ప్రమాదానికి గల కారణాలు ఆరా తీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్న వికారాబాద్ డిఎస్‌పి సత్యనారాయణ ప్రమాదానికి గల కారణాలను ఆరా తీయడం జరిగింది.

షార్‌లో ఇద్దరు జవాన్ల ఆత్మహత్య

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా శ్రీహరికోటలో ఇద్దరు జవాన్లు ఒకేరోజు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో ఒక ఎస్ఐ, ఒక సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉన్నారు. గంటల వ్యవధిలోనే వీరు ఆత్మహత్య చేసుకోవడం కలకలకం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీహరికోటలోగల అంతరిక్ష పరిశోధన కేంద్రంలోని రాడార్ సెంటర్లో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఈ నెల పదిన చింతామణి విధుల్లో చేరారు. చెట్టుకు ఉరేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారు. ఈ ఘటన జరిగిన కాసేపటికే శ్రీహరికోట మొదటి గేటు వద్ద విధుల్లో ఉన్న సిఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాస్‌సింగ్ తన గన్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆయన ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు. వీరి ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

తొందరొద్దు... మరింత చర్చ జరగాలి

మొదటి పేజీ తరువాయి

ఏకాభిప్రాయం ద్వారా మాత్రమే ఇటువంటి చర్య తీసుకోవాలి" అని రాజకీయ పార్టీలు అభిప్రాయపడ్డాయి. దీనిపై మరిన్ని చర్చలు జరపాల్సిన అవసరం ఉందని బిజెపి కూడా అభిప్రాయపడింది. రిమోట్ ఓటింగ్ మెషిన్ అమలుపై రాజకీయ పార్టీలు లిఖితపూర్వకంగా వ్యాఖ్యానించడానికి గడువును జనవరి 31 నుండి ఫిబ్రవరి 20 వరకు పొడిగించారు. సిపిఎం తరపున పొలిట్‌బ్యూరో సభ్యుడు నిలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యుడు మురళీధరన్, సాంకేతిక నిపుణుడు బప్పా సిన్హా పాల్గొన్నారు. వలస కార్మికులను కూడా ఎన్నికల ప్రక్రియలో భాగం చేయాలన్నదే తమ లక్ష్యమని, అయితే ప్రస్తుత కమిషన్ చర్యలు హడావుడిగా ఉన్నాయని సిపిఎం ప్రతినిధులు సమావేశంలో పేర్కొన్నారు. టిడిపి తరపున పాల్గొన్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రాష్ట్ర స్థాయిలో కూడా సమావేశాలు జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తరపున దిగ్విజయ సింగ్, ఆప్ తరపున సంజయ్ సింగ్, ఆర్జేడి తరపున మనోజ్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.

అంతరాల అఘాతం

మొదటి పేజీ తరువాయి

ప్రాథమిక పాఠశాలల్లో బోధించే 50 లక్షల మందికి వేతనాలివ్వచ్చు.

భారత్‌లోని బిలియనీర్లపై ఒకసారి రెండు శాతం పన్ను విధిస్తే రూ.40,423 కోట్ల ఆదాయం వస్తుంది. దీంతో దేశంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలందరికీ వచ్చే మూడేళ్ల పాటు పోషకాహారం అందించవచ్చు. 10 మంది కుబేరులపై ఒకసారి 5 శాతం పన్ను విధిస్తే రూ.1.37 లక్షల కోట్లు నిధులు సమకూరుతాయి. ఈ మొత్తం 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆయుష్ మంత్రిత్వ శాఖ అంచనా వేసిన నిధుల కంటే 1.5 రెట్లు ఎక్కువ కావడం విశేషం. దేశంలో ఒక పురుష కార్మికుడు సంపాదించే ప్రతి రూపాయికి మహిళా కార్మికులు కేవలం 63 పైసలు మాత్రమే పొందుతున్నారు. షెడ్యూల్డ్ కులాలు, గ్రామీణ ప్రాంత కార్మికుల సంపాదనల్లో తేడా మరింత ఎక్కువగా ఉంది. ఉన్నత సామాజిక వర్గాలు సంపాదిస్తున్న దానితో పోల్చితే షెడ్యూల్డ్ కులాల వారు 55 శాతం మాత్రమే పొందుతున్నారు.

ఆకలితో పిల్లల మరణాలు

"ఆకలి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్య విపత్తులు తదితర బహుళ సంక్షోభాలతో భారత్ బాధపడుతోంది. మరోవైపు దేశంలో కుబేరులు పెరిగిపోతున్నారు. అదే సమయంలో పేదలు జీవించడానికి కనీస అవసరాలను కూడా కొనుగోలు చేయలేకపోతున్నారు. విపరీతమైన ఆకలితో ఉన్న భారతీయుల సంఖ్య 2018లో 19 కోట్ల నుంచి 2022లో 35 కోట్లకు పెరిగింది. ఆకలి కారణంగా 2022లో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 65 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించింది.' అని ఆక్స్‌ఫామ్ ఇండియా సిఇఒ అమితాబ్ బెహర్ తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ఇలా..

'గత రెండేళ్లలో ప్రపంచంలోని ధనవంతుల్లో అగ్రశ్రేణి ఒక శాతం మంది కూడ బెట్టిన సంపద.. ప్రపంచ జనాభాలోని మిగిలిన వారు ఆర్జించిన దాంతో పోలిస్తే దాదాపు రెట్టింపు అయ్యింది. 170 కోట్ల మంది వేతనాలు పడిపోగా.. మరోవైపు బిలియనీర్ల సంపద రోజుకు 2.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.22వేల కోట్లు) పెరిగింది. ప్రపంచంలోని కుబేరులపై 5 శాతం పన్ను విధిస్తే వచ్చే 1.7 లక్షల కోట్ల డాలర్లతో 200 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకి తీసుకు రావచ్చు.' అని ఆక్స్‌ఫామ్ పేర్కొంది.

మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలోని చెన్నముక్కపల్లె రింగ్ రోడ్డు వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం బంధువుల ఇంటికి వెళుతుండగా కాన్వాయ్‌లోని మిథున్‌రెడ్డికి చెందిన వాహనాన్ని మరో కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఆ వాహనం పల్టీలు కొట్టింది. ఆ వాహనంలో ప్రయాణిస్తున్న ఎంపి వ్యక్తిగత కార్యదర్శి, భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులంతా సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుంగనూరు నుంచి వీరబల్లిలోని అత్తగారింటికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మంత్రి పెద్దిరెడ్డి వాహనంలోనే ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కూడా ఉండడంతో వారికి ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు తెలిపారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ (గుంటూరు జిల్లా)

నయంకాని దీర్ఘకాలిక వ్యాధులు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక భార్యను హతమార్చి ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ హృదయవిదారక సంఘటన గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కసుకర్రు గ్రామానికి చెందిన తూమంపాటి చినసుబ్బయ్య (50), రోజా (45) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా ఇద్దరూ దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో చినసుబ్బయ్య మంచానికే పరిమితమయ్యారు. దీంతో భార్య రోజా కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. వైద్యం చేయించుకోడానికి డబ్బుల్లేక, కుటుంబ పోషణకు రోజాకు వచ్చే కూలి డబ్బు చాలకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చినసుబ్బయ్య తన భార్యను కర్రతో కొట్టి చంపారు. ఆపై తానూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి వివరాలు సేకరించారు. మృతులకు పిల్లలెవరూ లేకపోవడంతో మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఎస్ఐ భార్గవ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటలతో ఐక్యత

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

క్రీడాకారులతో బివి రాఘవులు, సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-పొదిలి, వలేటివారిపాలెం (నెల్లూరు జిల్లా)

క్రీడలు ఐక్యతకు దోహదపడాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలంలోని నలదలపూరు గ్రామంలో ఆదివారం యువత ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకుల మధ్య క్రీడలు ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడాలన్నారు. ప్రతేడాది సంప్రదాయంగా యువకులు పోటీలు జరపడం సంతోషంగా ఉందన్నారు. కందుకూరు పట్టణ జట్టు విన్నర్స్‌గా, నలదలపూరు జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విన్నర్‌కు రూ.17వేలు, రన్నర్స్‌కు రూ.11,116 నగదు బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం పొగాకు గ్రేడింగ్ కూలీలతో మాట్లాడారు. పొగాకు పంటను పరిశీలించారు. కార్యక్రమంలో పొన్నగంటి రామయ్య, మాజీ సర్పంచ్ ఉన్నం వెంకటేశ్వర్లు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రజల ఐక్యతకు దోహదం: వి శ్రీనివాసరావు

తెలుగు వారి పండుగలు ప్రజల మధ్య ఐక్యతకు దోహపడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని కాటూరివారి పాలెంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆదివారం సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతికి ఓ ప్రత్యేక స్థానముందని, ఇది ప్రత్యేకంగా రైతుల పండగ అని తెలిపారు. పండిన పంటలు చేతికి వచ్చి కుటుంబ సభ్యులు, కొత్త అల్లుళ్లతో సంప్రదాయబద్ధంగా పండుగలను ప్రజలు ఐక్యతగా నిర్వహించుకోవాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక సమస్యలతో కుటుంబాలు ఒంటరిగా మారుతున్నాయన్నారు. ఇది ప్రజల సామాజిక భద్రతకు మంచిది కాదన్నారు. ప్రతి గ్రామంలో సంక్రాంతి సంబరాలు విస్తృతంగా నిర్వహించడం ద్వారా ప్రజల మధ్య ఐక్యతనుపెంపొందించాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతుందని తెలిపారు. ప్రకృతి వైఫల్యాలు, పాలకుల నిర్లక్ష్యంతో గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఆధునికత పేరుతో అంతరించిపోతున్న ప్రజాకళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. పొదిలి ప్రాంత ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు పాలకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం శ్రీనివాసరావును గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద మాకినేని వెంకట రమణయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రమేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ హై, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి, జెవివి పొదిలి డివిజన్ మాజీ అధ్యక్షుడు తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాంకులకు 'జగనన్న తోడు' లక్ష్యాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, సాంప్రదాయ కళాకారులకు వర్కింగ్ క్యాపిటల్‌గా రూ.10వేలు అందజేసే జగనన్న తోడు పథకం అమలుకు బ్యాంకు శాఖల వారీగా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ పథకం అమలును ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్, పట్టణ ప్రాంతాల్లో మెప్మాకి అప్పగించారు. జగనన్న తోడు ఫేజ్-5 కింద 3.95 లక్షలమంది లబ్ధిదారులు లక్ష్యంగా నిర్ణయించగా, అందులో 2.99 లక్షలమందికి మాత్రమే రుణాలిచ్చారు. మిగిలిన 95వేలమందికి సంబంధించి బ్యాంకులకు మొత్తాన్ని చెల్లించిన లబ్ధిదారుల రుణాల పునరుద్ధరణను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం బ్యాంకర్లకు సూచించింది. జగనన్న తోడు -6 కింద 4,90,376 మందికి జిల్లాల వారీగా రుణాలివ్వాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్ణయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి ఈనెల 18 నుంచి 21 వరకు సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. బ్యాంకుల వారీగా లక్ష్యాలను ఈనెల 25 లేదా అంతకుముందు డిసిసి సమావేశాన్ని నిర్వహించాలని, జెటిసి బ్యాంకు మేనేజర్లు, బ్యాంక్ కో ఆర్డినేటర్లతో సమన్వయం చేసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం సూచించింది.

తెలుగు రాష్ట్రాల్లో 'వందేభారత్' పరుగులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆధునిక వసతులతోపాటు అత్యంత వేగంగా గమ్యస్థానాలకు చేరవేసే వందేభారత్ రైలు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభమైంది. సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య విజయవాడ మీదుగా నడిచే ఈ రైలును ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో ఆదివారం ప్రారంభించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తెలంగాణా గవర్నర్ తమిళసై సౌందరరాజన్, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి, తెలంగాణా హోమ్ మంత్రి మహమ్మద్ అలీ, పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన వందేభారత్ రైలు విజయవాడకు సాయంత్రం నాలుగన్నర గంటలకు చేరుకుంది. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని నాని, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నర్సింహారావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్

శివేంద్ర మోహన్ తదితరులు వందేభారత్ రైలుకు స్వాగతం పలికారు.

వందేభారత్ రైలు సర్వీసులు మొదలు

వందే భారత్ రైలు(20834) సర్వీసులు సోమవారం నుంచి మొదలయ్యాయి. ఆదివారం మినహా వారంలో అన్ని రోజులు ఈ రైలు సేవలందించనుంది. మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి కదిలిన రైలు రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకుంది. 14 ఎసి చైర్‌కార్, 2 ఎగ్జిక్యూటివ్ ఎసి కోచ్‌లతో 1128 మంది ప్రయాణీకుల సామర్థ్యం కలిగి ఉన్న ఈ రైలుకు తొలి రోజు నామమాత్రంగానే ఆదరణ లభించింది. ఉదయం 5.45 గంటలకు విశాఖ నుంచి బయల్దేరే ఈ రైలు మధ్యాహ్నం 2 .45గంటలకు సికాంద్రాబాద్ చేరుకుంటుంది.



అప్పర్‌కౌశికను దాటిస్తున్న జగ్గన్నతోట ప్రభ

కన్నుల పండువగా ప్రభల ఉత్సవం

వేలాదిగా తరలివచ్చిన జనం

ప్రజాశక్తి - కొత్తపేట, అంబాజీపేట(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మకర సంక్రాంతి రోజున ప్రభల ఉత్సవం ఘనంగా జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభలను జూనియర్ కళాశాల ఆవరణలోకి చేర్చారు. అంబాజీపేట మండలం జగ్గన్నతోట, వాకలగరువు, తొండవరం ప్రభలను యువత పంటచేలను, అప్పర్ కౌశిక్ కాలువను దాటిస్తూ ముందుకు తీసుకెళ్లారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి తరలివచ్చిన జనంతో కొత్తపేట వీధులన్నీ కిక్కిరిశాయి. పాత రామాలయం, కొత్త రామాలయం, బోడిపాలెం నుంచి ప్రభలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగళవాయిద్యాలు, పలు కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగింపు ముందుకు సాగింది. ప్రభలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొలువు దీర్చారు. ఎలాంటి అసౌకర్యాలూ కలగకుండా కొత్తపేట డిఎస్‌పి కెవి రమణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ప్రభల ఊరేగింపులో డ్యాన్సులను పోలీసులు అడ్డుకోవడంతో గందరగోళం ఏర్పడగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చొరవతో యథావిధిగా ఊరేగింపును నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు వరకూ జరిగిన బాణసంచా కాల్పులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
(గవర్నమెంట్ పార్టనర్డ్ షెడ్యూల్డ్ బ్యాంక్)
హెడ్ ఆఫీస్: 27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట, విజయవాడ-520002,
ఫోన్: 0866-2429080, 94918 15197

APCOB

ARC No.105/SOD/Vij/2020 **బహిరంగ వేలము** EP No.1344/915/30/Vij-2021

(డిప్యూటీ రిజిష్ట్రార్, సహకార సంఘములు, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ వారి ఉత్తర్వుల మేరకు)

డిక్రీదారు బ్యాంకు: ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, కానూరు బ్రాంచి, కృష్ణాజిల్లా
తీర్పు ఋణగ్రస్తులు: వంగురు సోమలింగేశ్వరరావు, తండ్రి: వి.వెంకటేశ్వరరావు

పైన తెలుపబడిన తీర్పు ఋణగ్రస్తుల నుండి బకాయి మొత్తం **రూ.12,47,029.10 పై. (అక్షరాల పన్నెండు లక్షల నలభై ఏడు వేల ఇరవై తొమ్మిది రూపాయల పది పైసలు మాత్రమే 21.10.2021 వరకు)** తదితర వడ్డీ మరియు ఇతర ఖర్చులు పైన తెలుపబడిన తీర్పు ఋణగ్రస్తులు చెల్లించకపోయినందున ఈ దిగువ తెలుపబడిన స్థిరాస్తులు **APCOB బ్రాంచి, కానూరు** ఆవరణములో **ఉ॥ గం॥ 11.30 ని.లకు** బహిరంగ వేలము ద్వారా విక్రయించబడును.

స్థిరాస్తుల వివరములు

బకాయిదారు పేరు/ చిరునామా	ప్రాంతము/ మండలం	సర్వే నెం. విస్తీర్ణము	సరిహద్దులు	వేలము తేది సమయం	ధరావత్తు
వంగురు సోమలింగేశ్వరరావు తండ్రి: వి.వెంకటేశ్వరరావు ఫ్లాట్ నెం.201, వాణి ఎన్‌క్లేవ్, వాణి నగర్, కంకిపాడు గ్రామం & మండలం, కృష్ణాజిల్లా-521151	కంకిపాడు గ్రామం & మండలం	150/2 & 151/2 888.88 చ॥గ॥లు (అపార్ట్‌మెంట్) లోని 44.44 చ॥గ॥లు	**తూర్పు:** ఓపెన్ టు స్కై **పడమర:** కామన్ కారిడార్ **ఉత్తరం:** ఓపెన్ టు స్కై **దక్షిణం:** లిఫ్ట్ & ఓపెన్ టు స్కై	23-01-2023	రూ. 10,000/- మాత్రమే

పైన తెలుపబడిన స్థిరాస్తుల బహిరంగ వేలములో పాల్గొనదలచినవారు ధరావత్తు రూపేణా చూపబడిన మొత్తము రూ.10,000/-లు నగదు రూపముగా **సేల్ ఆఫీసర్, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్,** వేలము ముందురోజు కాని లేదా వేలము రోజు **ఉ॥ గం॥ 11.00 లకు** జమ చేయవలయును.

గమనిక:
1. వేలములో నిర్ణయించిన పాట మొత్తములో 15% వెనువెంటనే సేల్ ఆఫీసర్ ఖాతాలో జమ చేయవలెను. లేని యెడల పాటదారుడు తాను చెల్లించిన ధరావత్తు తిరిగి ఇవ్వబడదు.
2. మిగిలిన సొమ్ము పాట తేది నుండి 15 రోజులలోగా జమ చేయవలెను. లేని యెడల పాటదారుడు తాను చెల్లించిన మొత్తము సొమ్ము తిరిగి ఇవ్వబడదు.
3. పాటదారుడు పాట సొమ్ము మొత్తముతో పాటు రాష్ట్ర ప్రభుత్వము వారు నిర్ణయించిన స్టాంపు డ్యూటీని కూడా జమచేయవలెను.
4. పై విధముగా చెల్లించని యెడల మళ్ళీ తిరిగి బహిరంగ వేలము ద్వారా అమ్మబడును. దీనికి అగు ఖర్చులకు మరియు ఏర్పడే ఇబ్బందులకు మొదటి పాటదారుడే బాధ్యత వహించవలెను.
5. వేలములో పాల్గొన్నవారు ఇతరుల తరపున అయితే వారి నుంచి వ్రాత పూర్వకముగా ఒక ఆమోదిత ఉత్తరమును దాఖలు చేయవలెను. లేని యెడల వేలము తిరస్కరించబడును.
6. వేలము తేది నుంచి 30 రోజుల తర్వాత, సేల్ కన్ఫర్మేషన్ సర్టిఫికేట్ రిజిష్టారు గారిచే జారీ చేయబడును.
7. అత్యధిక పాటదారుడు మినహా ధరావత్తు సొమ్మును మిగతా పాటదారులందరికీ పాట అనంతరము అనగా సా॥ గం.5.00 లకు తిరిగి ఇవ్వబడును.
8. వేలము ఏ నిమిషములోనైనను ఎట్టి కారణము తెలుపకుండా నిలిపివేయుటకు, వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు సేల్ ఆఫీసర్ గారికి సర్వహక్కులు గలవు.
9. బకాయి దారుడు పాట ముందురోజు సూర్యాస్తమయము లోపల తన ఋణమును పూర్తి పరిష్కారము కావించినచో పాట నిలిపి వేయబడును.

ఆసక్తి కలిగిన పాటదారులు ఇతర వివరములకు **సేల్ ఆఫీసర్, ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి., గవర్నర్ పేట, విజయవాడ.** (ఫోన్: 94918 15197 వారి కార్యాలయ సమయములో సంప్రదించవచ్చును.)

స్థలము : విజయవాడ
తేది : 17.01.2023

సం/- సేల్ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్/ఓ.యస్.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు లి., గవర్నర్ పేట, విజయవాడ-520002.

షేర్‌చాట్‌లో 500 మంది ఉద్యోగులకు ఉద్వాసన

న్యూఢిల్లీ : సోషల్ మీడియా వేదిక షేర్‌చాట్‌లో షేర్‌చాట్ 500 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. ఇది ఆ సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో 20 శాతానికి సమానం. వ్యయాలు పెరిగిపోవడం, మూలధనం లభ్యత కొరవడటంతో ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఆ కంపెనీ తెలిపింది. షేర్‌చాట్‌తో పాటు తన షార్ట్ వీడియో యాప్ మోజ్‌లోనూ తాజా లేఆఫ్స్‌లో భాగంగా 500 మందిని తొలగించనున్నట్టు సమాచారం. సంక్లిష్ట పరిస్థితులు ఎదురైన క్రమంలో ఉద్యోగుల తొలగింపుపై ఆచితూచి నిర్ణయం తీసుకున్నామని షేర్‌చాట్ ప్రతినిధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకటనల రాబడి తగ్గడంతో పాటు లైవ్ స్ట్రీమింగ్ రెవెన్యూలూ పడిపోవడంతో రాబోయే రెండేండ్లు ప్రతికూల పరిస్థితులను ఎదురీదాల్సిఉందని, ఉద్యోగుల వ్యయాల్లో కోత వేయడం ద్వారా కంపెనీ ఈ ఇబ్బందులను అధిగమిస్తుందని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎగుమతుల్లో 12 శాతం పతనం

న్యూఢిల్లీ : గడిచిన ఏడాది 2022 డిసెంబర్‌లో భారత ఎగుమతులు 12.2 శాతం పతనమై 34.48 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత్తితో భారత సరుకులకు డిమాండ్ తగ్గుతోందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2021 ఇదే డిసెంబర్‌లో 39.27 బిలియన్ డాలర్ల ఎగుమతులు నమోదయ్యాయి. ఇదే సమయంలో 60.33 బిలియన్ డాలర్లుగా ఉన్న దిగుమతులు.. 2022 డిసెంబర్‌లో 58.24 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో భారత స్థూల ఎగుమతులు 9 శాతం పెరిగి 332.76 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు 24.96 శాతం పెరిగి 551.7 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి.

ఒప్పో ఎ78 5జి స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరణ

ముంబయి : ఒప్పో తన 5జి విభాగంలో మరో కొత్త స్మార్ట్‌ఫోన్ ఒప్పో ఎ78ను విడుదల చేసింది. 8 జిబి ర్యామ్, 256 జిబి స్టోరేజీతో దీన్ని ఆవిష్కరించింది. జనవరి 18నుంచి అమ్మకానికి పెడుతున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. సింగిల్ వేరియంట్‌లో ఆవిష్కరించిన ఈ ఫోన్ ధరను రూ.18,999గా నిర్ణయించింది. 5000ఎంఎహెచ్ బ్యాటరీ, వెనుకాల 50 ఎంపి, 12.5, 2 ఎంపి కెమెరాలతో సహా సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరాను అమర్చింది. ఆన్‌లైన్‌లో కొనుగోళ్లపై 10% వరకు తగ్గింపును ఇస్తున్నట్లు తెలిపింది.

సిఎ ఇంటర్మీడియట్‌కు 650 మంది అర్హత

అన్ అకాడమీ వెల్లడి

హైదరాబాద్ : నవంబరులో నిర్వహించిన సిఎ ఇంటర్మీడియట్ 2022 పరీక్షల్లో తమ విద్యార్థులు దాదాపు 650 మందికి పైగా అర్హత సాధించారని లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ అన్ అకాడమీ తెలిపింది. అందులో నలుగురు అభ్యర్థులు 50 లోపు టాప్ ర్యాంకులు సాధించారని ప్రకటించింది. టాప్ ర్యాంకర్లలో అక్షయ్ అగర్వాల్ (26వ ర్యాంక్), శివాంశ్ మిట్టల్ (38), అన్ష్ మార్కండేయ్ (42), గౌతమ్ చౌదరి (45) ఉన్నారని పేర్కొంది. వీరితోపాటు 180 మంది అభ్యర్థులు సిఎ ఇంటర్మీడియట్ రెండు గ్రూపులలో అర్హత సాధించారని పేర్కొంది.

ప్రతిపక్షనేతను అడ్డుకోవడం అధికార దుర్వినియోగం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రతిపక్షనేత పర్యటనను అడ్డుకోవడం అధికార దుర్వినియోగమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. అక్రమ కేసులతో పండుగ పూట పుంగనూరు టిడిపి నేతలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జైలులో పెట్టించి పెద్ద తప్పు చేశారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జైల్లోని బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు పర్యటనకు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి బ్యానర్లు కట్టించడం, టిడిపి బ్యానర్లు చించడం మరో తప్పు అని తెలిపారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో 30యాక్ట్ నోటీసు ఇప్పించడం అధికార దుర్వినియోగమేనని విమర్శించారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పోలీస్ యాక్ట్ 30 ఉన్నా యథేచ్ఛగా కోడిపందేలు, జూదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేవలం ప్రతిపక్షాల్ని ప్రజల వద్దకు, బాధితుల వద్దకు వెళ్లకుండా నిరోధించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తప్పు చేయకపోతే ప్రతిపక్ష నేతను అడ్డుకునే కుట్రలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల్ని భయపెట్టి లాండ్, శాండ్, వైన్, మైన్, రెడ్ శాండిల్ కుంభకోణాలు యథేచ్ఛగా చేస్తున్నారని విమర్శించారు. ఇవి బయటపడతాయనే భయంతోనే ప్రజలు, ప్రతి పక్షాలపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. డిజిపి జోక్యం చేసుకుని ప్రతి పక్ష నేత పర్యటన సజావుగా జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడాకారులతో నిర్వహణ కమిటీ

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

మాట్లాడుతున్న ఎఆర్ సిఐ గణపతి

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరులో నిర్వహిస్తున్న నాలుగు జిల్లాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కరుణా నిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజిమెన్ స్మారకంగా కొత్త ఐజక్‌శ్యామ్ బ్యాండ్మింటన్ అసోసియేషన్ (కిస్బా) ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాల స్థాయిలో పోటీలు జరిగాయి. మెన్ డబుల్స్ విభాగంలో బాపట్లకు చెందిన రామ్‌చరణ్, వెంకటేష్ విన్నర్లుగా, చిలకలూరిపేటకు చెందిన ఆకాష్, జితేంద్ర రన్నర్లుగా నిలిచారు. మెన్ సింగిల్స్‌లో చీరాలకు చెందిన కిరణ్ విన్నర్‌గా, సాయిచరణ్ రన్నర్‌గా గెలుపొందారు. వెటరన్ డబుల్స్‌లో కొలకలూరుకు చెందిన ఎస్.వినయ్‌కుమార్, పివి రాంబాబు విన్నర్లుగా, శ్రీమన్నారాయణ, గోపి కృష్ణ రన్నర్లుగా నిలిచారు. అండర్ 15 విభాగంలో తెనాలికి చెందిన సంజయ్, అరవింద్ విన్నర్లుగా, కొలకలూరుకు చెందిన విజ్ఞాన్, అవినాష్ రన్నర్లుగా విజయం సాధించారు. ఉమెన్స్ డబుల్స్‌లో కొలకలూరుకు చెందిన భవ్య, ప్రవణిదాస్ విన్నర్లుగా, తెనాలికి చెందిన మోహన, అర్షిణ్ రన్నర్లుగా గెలుపొందారు. ఎబిఎం చర్చి అధ్యక్షులు సుద్దపల్లి శరత్‌వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో విజేతలకు మంగళగిరి ఆరో బెటాలియన్ ఎఆర్ సిఐ అద్దేపల్లి గణపతి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జియాలజి విభాగాధిపతి డాక్టర్ పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్, కిస్బా అధ్యక్ష, కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్.వినయ్‌కుమార్, పి.వి రాంబాబు, సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

26లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఈనెల 16వ తేదీ వరకు 4,73,053మంది రైతుల వద్ద నుంచి రూ.5,324.31 కోట్ల విలువైన 26,08,125 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సంస్థ ఎమ్‌డి జి.వీరపాండియన్ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల లోపు రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు రైతులకు రూ.5324.31కోట్లు చెల్లించాల్సి ఉండగా, అందులో రూ.4779.85కోట్లు (90శాతం), 4,68,587మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఎమ్‌డి పేర్కొన్నారు. గోనె సంచులు, హమాలీ చార్జీలు, రవాణా చార్జీల తాలూకా రూ.61.48 కోట్లకు గానూ రూ.21.87 కోట్లను రైతుల ఖాతాల్లో (36శాతం) ఇప్పటి వరకు జమ చేసినట్లు తెలిపారు.

ADITYA BIRLA CAPITAL ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీసు: ఇండియన్ రయాన్ కాంపౌండ్, వేరవల్, గుజరాత్ 362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.40-2-5ఎ, [illegible] విజయవాడ-520010.
సంప్రదించవలసిన నం.: [illegible] +91 8939943443, [illegible] 9773758208.
2. వేలం సర్వీస్ ప్రొవైడర్ (ఏఎస్‌పి) [illegible] +91 8000023297.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

[illegible]

క్ర.సం.	రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతల పేరు	ఆస్తులు/సెక్యూర్డ్ అసెట్స్ వివరణ	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తాలు	రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు చెల్లింపు చివరి తేది	పరిశీలనకు తేదీ & సమయం	ఇ-వేలం తేది
1.	[illegible]	[illegible]	20.11.2021 నాటికి రూ.37,12,545.90 పైలు [illegible]	Rs.29,39,871/- [illegible]	Rs.2,93,987/- [illegible]	09-02-2023.	08.02.2023న ఉ. 11:00గం.ల నుండి సా.04:00గం.ల మధ్య	10-02-2023
2.	[illegible]	[illegible]	12.05.2021 నాటికి రూ.41,01,377.14పై [illegible]	Rs.26,20,285/- [illegible]	Rs.2,62,029/- [illegible]	09-02-2023.	08.02.2023న ఉ. 11:00గం.ల నుండి సా.04:00గం.ల మధ్య	10-02-2023
3	[illegible]	[illegible]	22.11.2021 నాటికి రూ.43,45,975.95 [illegible]	Rs.29,00,772/- [illegible]	Rs.2,90,077/- [illegible]	09-02-2023.	08.02.2023న ఉ. 11:00గం.ల నుండి సా.04:00గం.ల మధ్య	10-02-2023
4	[illegible]	[illegible]	06.05.2021 నాటికి రూ.22,15,044.46 పైలు [illegible]	Rs.21,50,550/- [illegible]	Rs.2,15,055/- [illegible]	09-02-2023.	08.02.2023న ఉ. 11:00గం.ల నుండి సా.04:00గం.ల మధ్య	10-02-2023

[illegible] homefinance.adityabirlacapital.com/- [illegible] https://sarfaesi.auctiontiger.net [illegible]

తేది: 17.01.2022
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

సంపాదకీయం

'కరోనా' దోపిడి

కరోనా కష్టకాలంలో దేశంలో జరిగిన దోపిడిని ఆక్స్‌ఫామ్ తాజాగా ప్రకటించిన నివేదిక కళ్లకు కడుతోంది. ఆ సమయంలో దేశ ప్రజలను ఆదుకోవడానికి ఎంతో చేశామంటూ కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారంలో వాస్తవం ఇసుమంత కూడా లేదని ఈ నివేదిక తేల్చివేసింది. ఆ సమయంలో కూడా కొద్దిమంది వద్ద సంపద పోగుపడటం ఏ మాత్రం తగ్గలేదు. ఆ కష్టకాలంలోనే కొత్తగా కొందరు శతకోటీశ్వరులు తయారయ్యారు. అదే సమయంలో పేదరికం మరింత తీవ్రంగా ముంచుకొచ్చింది. సామాన్యుల జీవనం దుర్భరం కాగా, మధ్య తరగతి లోని పలువురి జీవన ప్రమాణాలు పేదల స్థాయికి పడిపోయాయి. పేదల సంఖ్య పెరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఆర్థిక విధానాల కారణంగా దేశంలో అసమానతలు పెరగడం కొత్త కాదు. కానీ, ఏ మాత్రం ముందస్తు కసరత్తు లేకుండా అమలులోకి తీసుకువచ్చిన లాక్‌డౌన్ కారణంగా ఢిల్లీ నుండి గల్లీ వరకు దేశం మొత్తం స్తంభించి, ఉత్పత్తి కార్యక్రమాలు నిలిచిపోయిన తరువాత కూడా కొందరి సంపద పెరగడానికి, శత కోటీశ్వరుల జాబితా మరింత పెద్దది కావడానికి కారణం ఏమిటి? ఆ సమయంలోనే సామాన్యుల బతుకులు అల్లకల్లోలం కావడానికి కారణం ఏమిటి? ఇంకా వెంటాడుతున్న ఆ భయోత్పాతపు ప్రకంపనల నుండి మాములు ప్రజలకు విముక్తి ఎప్పుడు? జవాబు చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

కరోనా వైరస్ పేదల ఆరోగ్యాన్నే కాదు. వారి కష్టార్జితాన్ని కూడా పీల్చి పిప్పి చేసింది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం కరోనా విరుచుకుపడిన తొలి ఏడాది 2020లో అట్టడుగున ఉన్న ప్రజానీకంలో 50 శాతం మంది సంపద ఆవిరైపోయింది. జాతీయ ఆదాయంలో 13 శాతానికి, దేశ సంపదలో 3 శాతానికి వారి వాటా పడిపోయింది. 2020-2022 మధ్యకాలంలో శతకోటీశ్వరుల సంఖ్య గతంతో పోలిస్తే పెరిగింది. 2020లో 102గా ఉన్న వీరి సంఖ్య 2022 సంవత్సరానికి 166కు చేరింది. కరోనా రక్కసి దేశంలో కొత్తగా 64 మంది శతకోటీశ్వరులను తయారు చేసిందన్న మాట! జనాభాలో 30 శాతం మంది వద్ద 90 శాతం సంపద పోగుపడింది. దీనికి అదనంగా పైనున్న పదిశాతం మంది వద్ద 72 శాతం, ఐదు శాతం మంది వద్ద 62 శాతం సంపద పోగుపడిందని, ఇది కరోనా ముందు సంవత్సరాలతో పోలిస్తే చాలా ఎక్కువని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. దేశంలో అత్యధిక ప్రజానీకం పూట గడవడమే కష్టంగా రోజులు గడిపిన సమయంలో కొద్ది మంది సంపద ఎలా పెరిగింది? అలా చేరిన సంపద ఎవరి కష్టార్జితం? అదానీ, అంబానీ వంటి వేళ్ల మీద లెక్కపెట్టదగిన వారి దగ్గరకే ఎలా ఎగిరిపోయింది?

కరోనా విజృంభణకు ముందు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుండి 22 శాతానికి తగ్గించింది. ఫలితంగా 1.84 లక్షల కోట్ల రూపాయల ఆదాయం ఖజానాకు తగ్గింది. దీనిని పూడ్చుకోవడానికి దేశ ప్రజలందరి మీద భారం పడేలా పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ, జిఎస్‌టిలను భారీగా పెంచింది. కరోనా విజృంభణ తరువాత కూడా సామాన్యులపై మోపిన భారాన్ని తగ్గించడానికి నిరాకరించిన కేంద్రం, అదే సమయంలో వైరస్‌ను సాకుగా చూపి కార్పొరేట్లకు భారీ ప్యాకేజిలను ప్రకటించింది. ఆ సమయంలో వ్యక్తమైన విమర్శలను కూడా మోడీ సర్కారు పట్టించుకోలేదు. పైగా తమ విధానమే సరైనదని, కార్పొరేట్లకు ఇచ్చిన ప్యాకేజితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వాదించింది. ఆచరణలో కేంద్రం చేసిన వాదన అర్ధరహితమని తేలిపోయింది. కేంద్ర ప్రభుత్వం నుండి భారీ మొత్తాన్ని అందుకున్న కార్పొరేట్ సంస్థలు ఆర్థిక సంక్షోభాన్ని సాకుగా చూపి ప్రస్తుతం ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కూడా కుదిస్తున్నారు. రానున్న రోజుల్లో కొత్త రిక్రూట్‌మెంట్లు లేకపోగా, అనేక రంగాల్లో ఉన్న ఉద్యోగులను కూడా తొలగించే అవకాశం ఉందన్న సంకేతాలు వస్తున్నాయి. అదే జరిగితే పరిస్థితి మరింత ఘోరంగా మారుతుంది. కరోనా సమయంలో పెరిగిన అంతరాలను కళ్లకు కట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక సంపద పన్ను వేయాలని గట్టిగా ప్రతిపాదించింది. ఐదు సంవత్సరాల గరిష్ట కాల పరిమితితో ఒకటి, లేదా రెండు శాతం పన్ను విధిస్తే జరిగే అద్భుతాలను సోదాహరణంగా వివరించింది. ప్రజానీకం పెద్ద ఎత్తున కదిలి, ఒత్తిడి తెచ్చి, కేంద్రం మెడలు వంచితే కొంతమేరకైనా ఊరట లభించే అవకాశం ఉంది. ఆ దిశలో ప్రజలను చైతన్యపర్చడానికి అభ్యుదయ శక్తులు కదలాలి.

మహనీయుల మాట

నేడు జ్యోతిబసు వర్ధంతి

మార్క్సిజం శాస్త్ర ఆధారితం. దేశ, కాల, చరిత్ర, సమాజంతో ప్రమేయం లేకుండా ఒక స్తబ్దుగా ఉన్న, కదలిక లేని సిద్ధాంతం కాదు. మార్క్సిజం అభివృద్ధి చెందుతుంది. మార్క్సిజంలోనే అభివృద్ధిని సాధించే బలీయమైన శక్తి ఇమిడి ఉంది.

జననం : 8.8.1914
మరణం : 17.1.2010

ముంచుకొస్తున్న ప్రపంచ ఆర్థిక మాంద్యం

ప్రభాత్ పట్నాయక్

2023లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత మందగించబోతున్నదని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టినా జార్జీవా మొత్తానికి బహిరంగంగా ఒప్పుకున్నారు. అంతే కాదు, దాదాపు మూడో వంతు ప్రపంచంలో స్థూల జాతీయోత్పత్తి ఇప్పుడు ఉన్నదానికన్నా తగ్గిపోతుందని కూడా ఆమె ప్రకటించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక శక్తులు అమెరికా, యూరోపియన్ యూనియన్, చైనా - ఈ మూడూ వృద్ధిలో వేగం తరుగుదలను చవిచూడనున్నాయి. ఇదే ప్రపంచ ఆర్థిక మాంద్యం ముదిరిపోడానికి కారణమవనుంది. ఆ మూడింటిలో చైనాలో కోవిడ్ తిరిగి విజృంభించడం వలన అక్కడ వృద్ధి వేగం దెబ్బ తిననుంది. వాటిలో అమెరికా వరకూ తక్కిన దేశాలకన్నా సాపేక్షంగా మెరుగైన రీతిలో ఆర్థిక వ్యవస్థ నడక ఉండవచ్చునని క్రిస్టినా విశ్వసిస్తున్నారు. దానికి ప్రధాన కారణం అమెరికాలో కార్మికుల వేతనాల స్థాయి పెద్దగా పడిపోకుండా నిలదొక్కుకోగలగడం. వాస్తవానికి దాని వలన అమెరికన్ ఆర్థిక వ్యవస్థకే కాక ప్రపంచానికి కూడా ప్రయోజనం ఉంటుంది.

జార్జీవా వ్యాఖ్యలలో పొంతన కుదరని రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది: కార్మికుల ఆదాయాలను నేరుగా వేతనాల కోత రూపంలో గాని, లేకపోతే వారి సంక్షేమం కోసం చేసే ఖర్చుపై కోత విధించే రూపంలో గాని కుదించాలని ఐఎంఎఫ్ ఎప్పుడూ ప్రచారం చేస్తుంది. వ్యవస్థీకృత సర్దుబాటు చర్యలలో ఒక భాగంగా కార్మికుల ఆదాయాలను కుదించడం గురించి పట్టుబట్టే ఐఎంఎఫ్ ఇప్పుడు ఆ కార్మికుల ఆదాయాలు అమెరికాలో పెద్దగా పడిపోకుండా నిలబడినందువల్లనే అక్కడి పరిస్థితి కాస్త ఆశాజనకంగా ఉందని ఒప్పుకోవడం ఆశ్చర్యకరమైన విషయమే అయినా, ఆహ్వానించదగినది కూడా. కార్మికుల వేతనాలు పడిపోకుండా ఉన్నందువల్లనే అమెరికా ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోగలిగిందని ఆమె సూటిగా అంగీకరించకపోవచ్చు. ఆ వాస్తవాన్ని తిరగేసి అమెరికా ఆర్థిక వ్యవస్థ గట్టిగా నిలదొక్కుకోగలిగినందువల్లనే అక్కడి కార్మికుల వేతనాలు పడిపోకుండా నిలబడ్డాయని జార్జీవా వాదించవచ్చు. కాని ఆ విధంగా కార్మికుల వేతనాలు పడిపోకుండా ఉండడం ఒక "వరం"గా ఆమె పరిగణించడం అంటే, మార్కెట్‌లో కొనుగోలుశక్తిని నిలబెట్టడంలో కార్మికుల వేతనాలు పోషించే కీలకపాత్రను ఆమె గుర్తించిందన్నమాట.

సంక్షోభంలో ఉన్న దేశాల ఆర్థిక వ్యవస్థలు కోలుకోడానికి మాత్రమే వ్యవస్థీకృత సర్దుబాటు విధానాలను గురించి ఐఎంఎఫ్ పట్టుబడుతుందని, అంతే తప్ప ఆర్థిక వృద్ధికి దారి తీయడానికి మార్గంగా సర్దుబాటు విధానాలను ఐఎంఎఫ్ ఎప్పుడూ ప్రతిపాదించలేదని, అందువలన ఇప్పుడు జార్జీవా ప్రకటనను బట్టి ఐఎంఎఫ్ దృక్పథంలో ఏదో మార్పు వచ్చేసిందని మనం భావించకూడదని కొందరు చెప్పవచ్చు. కాని ఒకటి మాత్రం వాస్తవం. ఇంతకాలమూ తాను ప్రబోధిస్తూవస్తున్న విషయానికి భిన్నంగా ఇప్పుడు ఐఎంఎఫ్ చెప్పింది. అమెరికా ఆర్థికంగా నిలదొక్కుకోడానికి అక్కడి కార్మికుల వేతనాలు పడిపోకుండా ఉండడం తోడ్పడుతుందని ఒప్పుకుంది. సంక్షోభంలో ఉన్న ఇతర దేశాలలో కూడా తమ తమ సంక్షోభాలను అధిగమించడానికి అదేమాదిరిగా ఎందుకు ప్రత్యక్ష చర్యలు తీసుకోకూడదు? అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. దేశీయ డిమాండ్ ను పడిపోకుండా నిలుపుకోడానికి కార్మికుల వేతనాలను తగ్గించమో, వారి సంక్షేమానికి చేసే ఖర్చు తగ్గించడమో చేసే బదులు, దిగుమతులపై ఆంక్షలు విధించడం, ధరలను ప్రభుత్వం ప్రత్యక్షంగా నియంత్రించడం వంటి చర్యలు ఎందుకు పూనుకోకూడదు? నయా ఉదారవాదం ఇంతకాలమూ ప్రచారం చేస్తూ ఐఎంఎఫ్ ఇంతవరకూ గట్టిగా పట్టుబడుతున్నదానికి, ఇప్పుడు జార్జీవా ఒప్పుకున్న విషయానికి (కార్మికుల వేతనాలు పడిపోకుండా నిలబడడం అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా నిలబడడానికి దోహదం చేస్తుంది అన్న విషయం) మధ్య పూర్తి తేడా ఉంది అన్న విషయం గమనించాలి.

ఇక జార్జీవా చెప్పిన దాంట్లో పొంతన లేని రెండో విషయం సంగతి చూద్దాం. అమెరికాలో కార్మికుల వేతనాలస్థాయి పడిపోకుండా నిలబడడం అమెరికా వృద్ధికి దోహదం చేస్తూనే, మరోపక్క అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారి తీస్తుందని, దానివలన అమెరికన్ ఫెడరల్ రిజర్వు అక్కడ వడ్డీరేట్లను మరింతగా పెంచక తప్పదని ఆమె చెప్పారు. ఇది రెండు పర్యవసానాలను సూచిస్తోంది. మొదటిది: ప్రస్తుతానికి అమెరికా వృద్ధి రేటు కొనసాగినా, రాబోయే మాసాల్లో ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచడం వలన దెబ్బ తినవచ్చు. తక్కిన దేశాలతో పోల్చితే అమెరికా పరిస్థితి 2023లో బాగానే ఉన్నట్టు కనిపించినా ఈ పరిస్థితి దీర్ఘకాలంపాటు కొనసాగబోవడం లేదు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో జరిగే పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద మొత్తంగానే ప్రభావం చూపుతాయి. కాబట్టి రాబోయే మాసాల్లో ప్రపంచ ఆర్థిక మందగమనం మరింత పెరిగే అవకాశం స్పష్టంగా ఉంది. కోవిడ్ తాకిడినుండి కోలుకుని చైనా గణనీయంగా పురోగమించితే తప్ప ప్రపంచ ఆర్థిక మాంద్యం మరింత దిగజారడం అనివార్యంగా కనిపిస్తోంది. 2023 ప్రారంభంలో ప్రపంచంలో మూడో వంతు వరకూ ఆర్థికమాంద్యం ఆవరించినది కాస్తా అనతికాలంలో మరింత ఎక్కువ భాగానికి ఆ మాంద్యం విస్తరించనుంది. ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఏవిధంగా ఉండబోతోందో ఆ వ్యవస్థ ప్రతినిధే స్వయంగా ప్రకటించారు.

> **నిజానికి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక మార్గాంతరం లేని స్థితిలో పడిపోయిన వాస్తవ పరిస్థితిని ఇది సూచిస్తోంది.**

ఇదేమాదిరిగా ప్రపంచబ్యాంకు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో నెలకొన్న ఆర్థిక మాంద్యపు తీవ్రత గురించి, ప్రత్యేకంగా మూడో ప్రపంచ దేశాల మీద దాని ప్రభావం ఏవిధంగా పడబోతోంది అన్న విషయం గురించి హెచ్చరిస్తోంది. 2022 సెప్టెంబర్‌లో ప్రపంచబ్యాంకు విడుదల చేసిన ఒక పత్రంలో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 2023లో 1.9 శాతంగా ఉండబోతోందని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. ఐతే, ప్రపంచబ్యాంకు గాని, ఐఎంఎఫ్ గాని ముంచుకొస్తున్న ఆర్థికమాంద్యం ప్రధానంగా ఉక్రెయిన్ యుద్ధం వలన, దాని కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణం వలన (దానితోబాటు కొంతవరకూ కోవిడ్ మళ్ళీ తలెత్తడం వలన) వచ్చిందేనని చెప్తున్నాయి. ఆ ద్రవ్యోల్బణం కారణంగానే అన్నిదేశాల్లోనూ వడ్డీరేట్లు పెరిగాయని, ఇప్పుడు అది ఆర్థిక మాంద్యానికి దారితీసిందని అంటున్నాయి. అంతే తప్ప ఈ ముప్పు వెనుక నయా ఉదారవాద విధానాల పర్యవసానాలు పోషించిన పాత్ర వూసు ఎత్తడం లేదు.

ఇంతకూ, ఆర్థికమాంద్యం ముంచుకు రావడానికి ఈ రెండు సంస్థలూ చూపుతున్నవి సరైన కారణాలు కావు. ఉక్రెయిన్ యుద్ధం మొదలవడానికి చాలా ముందే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం తలెత్తింది. అప్పటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కోవిడ్ తాకిడి నుండి కోలుకోవడం కూడా మొదలైంది. కోవిడ్ కారణంగా సరుకుల సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నదని, దానివల్ల ద్రవ్యోల్బణం తలెత్తిందని అప్పుడు చెప్పుకొచ్చారు. కాని అప్పుడు కూడా చాలామంది ఆ వివరణతో ఏకీభవించలేదు. వాస్తవ సరుకుల కొరత కన్నా, సరుకుల కొరత ఏర్పడబోతోందన్న అంచనాతో బడా కార్పొరేట్లు ముందస్తుగా తమ లాభాల మార్జిన్‌లను బాగా పెంచివేసి సరుకుల ధరలు పెరిగిపోడానికి కారణమయ్యాయని, అందువల్లనే ద్రవ్యోల్బణం ఏర్పడిందని వారు అసలు సంగతి బైటపెట్టారు. ఆ విధంగా ద్రవ్యోల్బణం విజృంభిస్తున్న సమయంలో ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. ఆ పేరుతో పశ్చిమ పెట్టుబడిదారీ దేశాలు రష్యా మీద ఆంక్షలు విధించాయి. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణం ఇతోధికంగా పెరగడానికి దారితీసింది.

ముడిచమురు ధరలు ఏవిధంగా పెరిగిపోయాయో పరిశీలిస్తే ఉక్రెయిన్ యుద్ధం తోనే ద్రవ్యోల్బణం మొదలైందన్న వాదన తప్పు అని స్పష్టం అవుతుంది. ప్రపంచం కోవిడ్ సంక్షోభం నుండి 2021లో కోలుకుంటున్న సమయంలో క్రూడాయిల్ ధరలు పెరగడం మొదలైంది. 2021 ఆరంభంలో బ్యారెల్ ముడిచమురు 50.37 డాలర్లు ఉన్నది కాస్తా ఆ ఏడాది చివరికి 77.24 డాలర్లకు ఎగబాకింది. ఇది 50 శాతం కన్నా ఎక్కువ పెరుగుదల. అదే ఉక్రెయిన్ యుద్ధం జరిగిన ఏడాది 2022లో చూస్తే 78.25 డాలర్ల నుండి 82.82 డాలర్లకు పెరిగింది. ఇది 5.8 శాతం పెరుగుదల మాత్రమే. వాస్తవానికి ప్రస్తుతం సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఉన్న ద్రవ్యోల్బణం రేటు కన్నా ఇది తక్కువ. రష్యా మీద ఆంక్షలు విధించినట్టు ప్రకటించగానే క్రూడాయిల్ ధర అమాంతం 133.18 డాలర్లకు పెరిగిపోయింది. ఐతే ఆ వెంటనే అంతే వేగంగా వెనక్కి వచ్చింది. అంటే ఉక్రెయిన్ యుద్ధం వల్లనే ద్రవ్యోల్బణం అన్న వాదన తప్పు అని స్పష్టం అవుతోంది. నిజానికి యుద్ధం కన్నా ప్రధాన కారణం అమెరికా విధించిన ఆంక్షలు .

> **వాళ్ళు చెప్తున్నట్టు ఉక్రెయిన్ యుద్ధం వల్లనే ఈ మాంద్యం ముంచుకొచ్చింది వాస్తవమే అయితే, ఆ యుద్ధాన్ని త్వరగా ముగించడానికి పూనుకోవాలి కదా. కాని పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ఈ యుద్ధాన్ని త్వరగా ముగించడానికి సుముఖంగా లేరు. దానికి బదులు, ఈ యుద్ధాన్ని సాగదీసి, ఆ క్రమంలో రష్యా పూర్తిగా బలహీనపడి తమకు దాసోహం కావాలని వాళ్ళు కోరుతున్నారు.**

బ్రెట్టన్‌వుడ్ సంస్థల విశ్లేషణ లోపభూయిష్టంగా ఉండడం మాత్రమే కాదు. ఆ సంస్థలకు ఈ ప్రపంచ మాంద్యం ఏవిధంగా ముగింపుకు రాబోతోందో కూడా అవగాహన లేదు. వాళ్ళు చెప్తున్నట్టు ఉక్రెయిన్ యుద్ధం వల్లనే ఈ మాంద్యం ముంచుకొచ్చింది వాస్తవమే అయితే, ఆ యుద్ధాన్ని త్వరగా ముగించడానికి పూనుకోవాలి కదా. కాని పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదులు ఈ యుద్ధాన్ని త్వరగా ముగించడానికి సుముఖంగా లేరు. దానికి బదులు, ఈ యుద్ధాన్ని సాగదీసి, ఆ క్రమంలో రష్యా పూర్తిగా బలహీనపడి తమకు దాసోహం కావాలని వాళ్ళు కోరుతున్నారు. అందుకే ఈ రెండు సంస్థలూ ఉక్రెయిన్ యుద్ధం త్వరగా ముగిసిపోవడానికి అనుగుణంగా ఏ ప్రతిపాదనలనూ చేయడం లేదు. అంతే కాదు, వడ్డీ రేట్లను మరింత పెంచడం మినహా, తద్వారా మాంద్యాన్ని మరింత ముదరబెట్టడం మినహా, వాళ్ళ దగ్గర ఏ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలూ లేవు. స్వేచ్ఛామార్కెట్ సూత్రానికి ఆ సంస్థలు ఎంతగా అంకితం అయిపోయాయంటే వారి ఊహల్లో ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయడానికి తోడ్పడే మరే ఇతర ప్రతిపాదనలూ లేనే లేవు (నిజానికి ప్రభుత్వాలు నేరుగా మార్కెట్ లో జోక్యం చేసుకుని ధరలను నియంత్రించవచ్చు. అప్పుడు ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది.). ఆర్థికమాంద్యం ప్రభావం గురించి వాపోవడం మినహా వారేమీ చేయడం లేదు.

ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు డేవిడ్ మల్పాస్ రుణభారాలతో మగ్గిపోతున్న మూడో ప్రపంచ దేశాల గురించి మాట్లాడుతూ, ఆ దేశాల రుణభారానికి ప్రధాన కారణం అధిక వడ్డీరేట్లు అని చెప్తున్నాడు. కాని ఆ అధిక వడ్డీరేట్లను తగ్గించే ప్రతిపాదన ఏదీ చేయడం లేదు. ఈ బ్రెట్టన్‌వుడ్ సంస్థలు చాలా అతిగా మూడో ప్రపంచదేశాల పేదలమీద జాలి పడుతున్నాయి కాని వారి కష్టాలకు పరిష్కారం చూపే విషయంలో చాలా తక్కువగా కదులుతున్నాయి.

ఇది కేవలం ఆ సంస్థలకున్న పిరికితనం వల్ల వచ్చినది కాదు. నిజానికి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక మార్గాంతరం లేని స్థితిలో పడిపోయిన వాస్తవ పరిస్థితిని ఇది సూచిస్తోంది. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదం కొన్ని సంవత్సరాలుగా బిగించిన పట్టును యథాతథంగా నిలబెట్టుకోవాలంటే అవి ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగించాల్సిందే. అప్పుడు ఈ ద్రవ్యోల్బణం, దానితోబాటు వాళ్ళు సృష్టించిన ఆర్థిక మాంద్యం కొనసాగాల్సిందే. అప్పుడు నిరుద్యోగం పెరగక తప్పదు. ఇది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంచుకున్న మార్గమే. ఇందులో ఆశ్చర్యపడవలసినది ఏమీ దేదు. దానిని ప్రతిఘటించడమే ముందున్న కర్తవ్యం.

> **ఇది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంచుకున్న మార్గమే. ఇందులో ఆశ్చర్యపడవలసినది ఏమీ దేదు. దానిని ప్రతిఘటించడమే ముందున్న కర్తవ్యం.**

(స్వేచ్ఛానువాదం)

★

విశ్లేషణ

వేర్పాటువాదం వద్దు!

కె. లోకనాథం

> **వేరే రాష్ట్రం ప్రకటన ఈయన ఒకసారి, రెండు సార్లు కాదు. అనేక సార్లు... ఇదే ప్రకటన చేస్తూ వస్తున్నారు. వారి అధిష్టానం నుండి దీనిపై ఎలాంటి స్పందన ఇప్పటివరకూ లేదు. అధిష్టానం సమ్మతితోనే ఈయన ఈ ప్రకటనలు చేస్తున్నారా? లేక వారే ఈయనతో చేయిస్తున్నారా? అలాంటిదే అయితే, రాష్ట్రంలో మరో వేర్పాటువాదాన్ని అధికార పార్టీయే ప్రోత్సహిస్తోందని భావించవలసి వస్తుంది.**

రాష్ట్ర రాజధాని విశాఖకు రాకపోతే, విశాఖ రాజధానిగా ప్రత్యేక రాష్ట్రం ఉత్తరాంధ్ర ప్రజలు ఏర్పాటు చేసుకుంటారని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఇటీవల ఆయన ఇదే మాటను పదేపదే ప్రకటిస్తున్నారు.

తాజాగా ఆయన శ్రీకాకుళం జిల్లాలోని ఒక రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో-శ్రీకాకుళం చుట్టూ సముద్రం ఉంది. కానీ, ఇక్కడ ఫిషింగ్ హార్బరు లేదు. జెట్టీ లేదు. ప్రాజెక్టులు పూర్తి కాలేదు. గ్రామాల్లో తాగు నీరు లేదు. మేమెలా ఉండాలి?-అని ప్రశ్నించారు. అయితే, అవన్నీ ఎందుకు లేవో, ఎవరు సమాధానం చెప్పాలి? ఎవరు బాధ్యత వహించాలి? అధికారంలో ఉన్నవారే కదా! అంటే వీరి ప్రభుత్వమే, అందులో మంత్రిగా ఉన్న వీరే సమాధానం చెప్పాలి. అందులోనూ ఈయన ఐదు సార్లు ఎమ్మెల్యే అవడమే కాక, ఐదు సార్లు మంత్రిగా కూడా చేశారు. తన పదవీ కాలంలో ఉత్తరాంధ్రకు కాకపోయినా, కనీసం వీరి జిల్లాకైనా ఏమైనా మంచి చేశారా? సమాధానం చెప్పవలసిన వారే ప్రశ్నించడం వింతగానే ఉంటుంది.

వేరే రాష్ట్రం ప్రకటన ఈయన ఒకసారి, రెండు సార్లు కాదు. అనేక సార్లు... ఇదే ప్రకటన చేస్తూ వస్తున్నారు. వారి అధిష్టానం నుండి దీనిపై ఎలాంటి స్పందన ఇప్పటివరకూ లేదు. అధిష్టానం సమ్మతితోనే ఈయన ఈ ప్రకటనలు చేస్తున్నారా? లేక వారే ఈయనతో చేయిస్తున్నారా? అలాంటిదే అయితే, రాష్ట్రంలో మరో వేర్పాటువాదాన్ని అధికార పార్టీయే ప్రోత్సహిస్తోందని భావించవలసి వస్తుంది.

శ్రీకాకుళం జిల్లాకు రాష్ట్రంలోనే అత్యధికంగా 193 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతముంది. అపార మత్స్య సంపద ఉత్పత్తి అయ్యే భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మించమని ఎప్పటి నుండో అక్కడి మత్స్యకారుల డిమాండ్ చేస్తున్నారు. మూడేళ్లు దాటినా ప్రభుత్వం ఎందుకు దీనిని పూర్తి చేయలేదు? ఎవరు అడ్డుపడ్డారు? రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి ఇదే జిల్లాకు చెందిన వారైనా ఎందుకీ స్థితి నెలకొంది? వీరికి ఆ ప్రాంతంలో కార్పొరేట్ కంపెనీ నిర్మించబోయే పోర్టు మీద, ఆ పేరున బలవంతపు భూ సేకరణ మీద ఉన్న శ్రద్ధ ... ఇక్కడి మత్స్యకారులపై లేకపోవడం తప్ప మరొకటి కాదు.

ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి, తాగు నీటికి కటకటలాడడానికి కారణమెవరు? ఎవరిని నిందించాలి? ఉత్తరాంధ్రలో అతి పెద్ద నది అయిన వంశధారపై రెండో దశ నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదు? ఈ మూడేళ్లలోనైనా చేసిందేమైనా ఉందా? నిర్వాసితులకు చట్ట ప్రకారం నష్ట పరిహారం ఎందుకు ఇవ్వలేదు? మహేంద్ర తనయ నదిపై నిర్మించే ఆఫ్ షోర్ ప్రాజెక్టుకు ఎందుకు అతీగతీ లేకుండా ఉంది?

ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమీ లేదు కానీ, చేసిన అన్యాయమే ఎక్కువ. సముద్ర తీరాన్ని మొత్తం కాలుష్య కారక పరిశ్రమలతో కలుషితం చేసేస్తున్నారు. భూగర్భ జలాలు సైతం కలుషితమై తాగడానికి కూడా నీరు లేక కొన్ని గ్రామాల్లో ప్రజలు తమను తరలించాలని వేడుకుంటున్నారు. స్వంత గ్రామాల నుండే బయటకు పోవాలని కోరుకునేంత తీవ్రంగా కాలుష్యం వెదజల్లబడుతోంది. ఇది చాలదన్నట్లు దేశమంతా తిరస్కరించిన, ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంటును ఉత్తరాంధ్ర నెత్తిన రుద్దుతున్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై అంత ప్రేమున్న వారు ఈ కాలుష్యం నుండి ఉత్తరాంధ్రను, తన స్వంత జిల్లాను కాపాడవచ్చు కదా! ఎవరు కాదన్నారు?

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టాన్ని అమలు చేయకుండా తీరని ద్రోహం చేస్తోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు ఎగనామం పెట్టింది. హక్కుగా రావలసిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఇవ్వలేదు. పదేళ్లయినా ఇంకా విద్యా సంస్థల నిర్మాణం పూర్తి చేయలేదు. గిరిజన యూనివర్సిటీ నిర్మాణమే ప్రారంభం కాలేదు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఇవ్వలేదు. సరికదా ఉన్న రైల్వే డివిజన్‌నే ఎత్తేయాలని నిర్ణయించింది. విశాఖ మెట్రో రైలు మాటే మరిచింది. వీటిపై ఎప్పుడైనా వైసిపి ప్రభుత్వం కేంద్రాన్ని నిలేసింది లేదు. తెలుగు ప్రజలు ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం అమ్మేయాలని నిర్ణయిస్తే, దాన్ని వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గట్టిగా కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదు? దీనికి మించి ధర్మాన నిస్సిగ్గుగా కేంద్ర నిర్ణయాన్ని సమర్థించడం ఆ ద్రోహంలో భాగం పంచుకోవడం కాదా? మంత్రి గారి మాటలు వింటుంటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానం అసలు తీర్మానమే కాదేమోనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ పాలసీ ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారని సమర్థిస్తూ మాట్లాడుతున్నారు. 'విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో అనేక త్యాగాల ఫలితంగా వచ్చినదాన్ని కేంద్ర ప్రభుత్వం అమ్ముతూ ఉంటే ఈ మంత్రిగారు సమర్థిస్తున్నారంటే ఆంధ్ర రాష్ట్రానికి ఎంతటి ద్రోహం చేస్తున్నారో విజ్ఞులైన ప్రజలే అర్థం చేసుకోవాలి.

ఉత్తరాంధ్ర ప్రజలు సహజంగానే సౌమ్యులు. అయితే తేడా వస్తే మాత్రం అవకాశం వచ్చినప్పుడు తాట తీస్తారు. నేడు ఉత్తరాంధ్ర ప్రజలు గొంతెమ్మ కోర్కెలేమీ కోరడం లేదు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీగా దీన్ని కాపాడుకోవడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుకుంటున్నారు. పెండింగు నీటి ప్రాజెక్టులన్నీ పూర్తి కావాలని కోరుకుంటున్నారు. పర్యావరణం పరిరక్షించబడాలని కోరుకుంటున్నారు. అభివృద్ధిని కోరుకుంటున్నారు. కానీ నిస్సందేహంగా ప్రత్యేక రాష్ట్రాన్ని మాత్రం కోరుకోవడం లేదు. ఉత్తరాంధ్ర ప్రజలు విబేధాలను కాదు, ఐక్యతను కోరుకుంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేతనైతే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పరిపాలించాలి. అంతే కానీ, ప్రాంతాలు, ప్రజల మధ్య రాజధాని పేరుతో చిచ్చు మాత్రం పెట్టకూడదు. ప్రత్యేక రాష్ట్రం డిమాండు లేవనెత్తడం చిన్న విషయమేమీ కాదు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికైనా స్పందించి, ప్రత్యేక రాష్ట్రంపై తమ వైఖరిని స్పష్టం చేయాలి.

(వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

★

జనవాక్యం

విద్య, ఉపాధి ద్వారానే నేర ప్రవృత్తికి చెక్

ఆధునిక కాలంలో కూడా మన దేశంలో నేరస్తులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. శిక్ష పడిన ఖైదీల కంటే, నేరారోపణ ఎదుర్కొంటున్న ఖైదీలే సుమారు 77 శాతం మంది జైల్లో మగ్గుతున్నారు. నూతన జైళ్ళు నిర్మించాలనే మాటలు వినబడుతున్నాయి. 2020 నుంచి 2021 నాటికి సుమారు 15 శాతం నేరాలు, నేరస్తుల సంఖ్య పెరగటం బాధాకరం. దీనికి ప్రధాన కారణం విద్య లేకపోవడం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం. రాజ్యాంగం ప్రకారం పతీ ఒక్కరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అందేటట్లు, అందుబాటులో ఉండేటట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి. కానీ రకరకాల జీవోలు, యన్.ఇ.పి-2020 వంటి నిర్ణయాల ద్వారా నాణ్యత కలిగిన విద్యను దూరం చేస్తున్నారు. దాంతో సరైన విజ్ఞానం లేక ఉపాధి కోసం వక్రమార్గాలు పడుతూ అసాంఘిక శక్తులుగా మారే అవకాశం కనపడుతుంది. పేదరికం, కుటుంబ, ఆర్థిక, సామాజిక, ఆరోగ్య పరిస్థితులు కూడా నేర ప్రవృత్తి పెరగడానికి కారణం అవుతున్నది. అలాగే చదువు పూర్తయిన యువతకు ప్రభుత్వాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు అధిక బడ్జెట్ కేటాయింపులు చేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించటంతోపాటు సమాజంలో వెనుకబడిన తరగతుల వారికి, మహిళలకు ప్రభుత్వాలు రక్షణగా ఉండాలి.

- ఐ. ప్రసాదరావు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

నాశనమవుతున్న విలువలు

- మల్లికా సారాభాయ్ ఆవేదన

కోల్‌కతా : భారతదేశంలో విలువలు, ఆదర్శాలు నాశనమై పోతున్నాయని ప్రముఖ నృత్య కళాకారిణి, ఉద్యమ కారిణి మల్లికా సారాభాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. హిందూవాదం పేరుతో ప్రజల గొంతుల్లోకి హిందూ మతతత్వాన్ని నెడుతున్నారని విమర్శించారు. ఇక్కడ కోల్‌కతా సాహిత్య ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆమె తన జీవితం, కెరీర్, ప్రపంచ నాట్య రంగంలో తన కృషి గురించి మాట్లాడారు. "ఈనాడు నా చుట్టూ జరుగుతున్న సంఘటనలు నన్నెంతో నిరాశకు గురిచేస్తున్నాయి. మన భారతదేశంలో ఇలా విలువలు పూర్తిగా నాశనమవుతాయని అసలు ఊహించలేదు. వాణిజ్య ప్రకటనలు, బ్రాండ్ల వెల్లువలో చాలామంది కొట్టుకుపోతున్నారు." అని వ్యాఖ్యానించారు. కేవలం ప్రశ్నలు అడిగినందుకే తన స్నేహితుల్లో చాలామంది జైలుకు వెళ్లారని ఆమె అన్నారు. వేదాల్లో చెప్పినట్లుగా అసలు హిందూమతం అంటేనే ప్రశ్నలు అడగడమని ఆమె వ్యాఖ్యానించారు. దురదృష్టవశాత్తూ హిందూత్వ రూపంలో హిందూ మతతత్వాన్ని ప్రచారం చేస్తున్నారని అన్నారు. కోల్‌కతాలో వివిధ మతాల వారు కలిసికట్టుగా వుండడం చూస్తుంటే ఆనందంగా వుందని, ఇలాంటి పరిస్థితిని గుజరాత్‌లో చూడలేమని చెప్పారు.

జోషిమఠ్‌లో సహాయ కార్యక్రమాలు ముమ్మరం

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్‌లో భూమి కుంగిపోతుండటం, భవనాలు, ఇళ్లకు పగుళ్లు, రోడ్లు కుంగిపోవడం పెను విపత్తుగా పరిణమిస్తోంది. భూమి భారీగా కోతకు గురవుతుండటం పట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. జోషిమఠ్‌లో భూమి కుంగిపోతుండటంతో 782 భవనాలు దెబ్బతిన్నాయి. వీటిలో 148 భవనాలు సురక్షితమైనవి కాదని అధికారులు గుర్తించారు. 223 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు జిల్లా అధికారులు తరలించారు. సహాయ, పునరావాస చర్యలు చేపట్టేందుకు సైన్యాన్ని రంగంలోకి దించారు. సహాయ చర్యలను సమన్వయం చేస్తూ సహాయ బృందాలకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం చేరవేసేందుకు జోషిమఠ్ ప్రాంతంలో ఆర్మీ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఆర్మీ నుంచి క్విక్ రెస్పాన్స్ టీం, రెస్క్యూ టీం, పికెటింగ్ పార్టీ, పర్వతారోహణలో నిపుణులతో కూడిన టీం, వైద్య బందం రంగంలోకి దిగి సహాయ, పునరావాస కార్యక్రమాలను ముమ్మరం చేశాయి.

ఉద్యోగ అవకాశాలకు శరాఘాతం

- ప్రపంచవ్యాప్తంగా 30లక్షలకుపైగా ఉద్యోగాల కోత
- 21 కోట్లకు చేరనున్న నిరుద్యోగుల సంఖ్య : ఐఎల్‌ఒ
- విద్య, శిక్షణ రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి..

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది భారీ ఎత్తున ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని అంతర్జాతీయ కార్మిక సంఘం (ఐఎల్‌ఒ) హెచ్చరించింది. ఉపాధి, ఉద్యోగ రంగాలు 2023లో గణనీయంగా ప్రభావితం అవుతాయని ఐక్యరాజ్యసమితి కూడా కొద్ది రోజుల క్రితం ఒక నివేదిక విడుదల చేసింది. ఇదే అంశంపై ఐఎల్‌ఒ తాజాగా నివేదిక విడుదల కావటం గమనార్హం. నిరుద్యోగ రేటు భారీగా పెరిగే అవకాశముందని ఐఎల్‌వో నివేదిక అంచనా వేస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం, అధిక ద్రవ్యోల్బణం, కఠినమైన ద్రవ్య విధానాలు..ఇవన్నీ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, వృద్ధిరేటును 1శాతానికి తగ్గించిందని నివేదిక పేర్కొంది. ఇందులోని మరికొన్ని వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉపాధిరేటులో వృద్ధి 2023లో 1.5శాతం ఉండొచ్చని గతంలో ఐఎల్‌ఒ అంచనా వేయగా, దీనిని తాజాగా మరింత తగ్గించింది. తక్కువ వేతనాలకు, నాణ్యతలేని ఉద్యోగాలకు ఒప్పుకునేలా ప్రస్తుత ఆర్థికమాంద్యం పరిస్థితుల్ని సృష్టిస్తోందని నివేదిక పేర్కొంది. విద్య, శిక్షణ రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాల్సిన అవసరముందని, యువతకు సరైన చదువు, శిక్షణ లేకపోవటం వల్ల తక్కువ వేతనాలకు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది నిరుద్యోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 30 లక్షల మంది కొత్తగా నిరుద్యోగులుగా మారుతారు. మొత్తంగా వీరి సంఖ్య సుమారుగా 21కోట్లకు చేరుకుంటుంది. నిరుద్యోగరేటు 5.8శాతానికి పెరుగుతుంది. అధిక ద్రవ్యోల్బణం ఆయా దేశాల్లో నిజ వేతనాల్ని మింగేస్తాయి. ఆర్థికమాంద్యం వృద్ధి గణాంకాల్ని, ఉపాధిరేటును దెబ్బతీస్తోంది. దీనినిబట్టి కోవిడ్-19 సంక్షోభం నుంచి ప్రపంచం 2025లోగా బయట పడేలా కనపడటం లేదని ఐఎల్‌ఒ రీసెర్చ్ విభాగం డైరెక్టర్ రిచర్డ్ సమాన్స్ అన్నారు.

పెరగనున్న జీవనవ్యయం

కార్మికరంగంలో వేతనాలు నామమాత్రంగా ఉన్నాయి. వీటితో పోల్చుకుంటే నిత్యావసర సరుకుల ధరలు వేగంగా పెరుగుతున్నాయి. అంతటా జీవనవ్యయం పెరగటం వల్ల మరింత మంది పేదరికంలోకి కూరుకుపోతారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగిస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని పరిశోధకులు అంచనావేశారు. దీనిపై ఐఎల్‌వో డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ హౌంగ్ మాట్లాడుతూ, కోవిడ్ సంక్షోభం నుంచి స్వల్ప, మధ్య ఆదాయ దేశాలు పూర్తిగా బయటపడలేదు. దీనికితోడు వాతావరణ మార్పులు, మానవ సంక్షోభం కొత్త సవాళ్లను విసురుతున్నాయని ఆయన అన్నారు.

వాతావరణ చర్చను హైజాక్ చేస్తున్నారు

- పర్యావరణ కార్యకర్తల ఆందోళన
- పెద్ద చమురు సంస్థల పాత్రకు వ్యతిరేకంగా దావోస్‌లో నిరసన

దావోస్ : వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్)లో పెద్ద చమురు సంస్థల పాత్రపై వాతావరణ కార్యకర్తల నుంచి ఆందోళన వ్యక్తమైంది. సంస్థల పాత్రకు వ్యతిరేకంగా వారు దావోస్‌లో నిరసన తెలిపారు. వారు (పెద్ద చమురు సంస్థలు) వాతావరణ చర్చను హైజాక్ చేస్తున్నారని వాతావరణ కార్యకర్తలు చెప్పారు. స్విస్ రిసార్ట్‌లో జరిగే వార్షిక సమావేశానికి హాజరైన 1500 మంది వ్యాపార నాయకులలో బీపీ, చెవ్రాన్, సౌదీ అరామ్‌కోతో సహా ప్రధాన ఇంధన సంస్థలు ఉన్నాయి. వాతావరణ మార్పులతో సహా ప్రపంచ ముప్పులు వంటివి ఈ సమావేశంపు అజెండాలో ఉన్నాయి.

స్విట్జర్లాండ్‌లోని యంగ్ సోషలిస్టు పార్టీకి నేతృత్వం వహిస్తున్న నికోలస్ సీగ్రిస్ట్ మాట్లాడుతూ.. తాము కచ్చితమైన, నిజమైన వాతావరణ చర్యను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రపంచ వ్యాపార, రాజకీయ నేత వార్షిక సమావేశం సోమవారం దావోస్‌లో అధికారికంగా ప్రారంభమైంది. "వారు రాజకీయ నాయకులతో ఒకే గదిలో ఉంటారు. వారి ప్రయోజనాల కోసం వారు ముందుకు వస్తారు" అని డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో ఇంధన సంస్థల ప్రమేయం గురించి మాట్లాడుతూ సీగ్రిస్ట్ అన్నారు. తక్కువ కార్బన్ ఆర్థిక వ్యవస్థలకు దేశాలు మారుతున్నందున ప్రపంచ ఇంధన మిశ్రమంలో శిలాజ ఇంధనాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, శక్తి పరివర్తనలో భాగం కావాలని చమురు, గ్యాస్ పరిశ్రమ పేర్కొన్నది. దావోస్ స్క్వేర్‌లో కురుస్తున్న మంచును సైతం లెక్క చేయకుండా వంద మందికి పైగా నిరసనకారులు గుమిగూడి ఆందోళనను చేపట్టారు. నినాదాలు వినిపించారు. 'వాతావరణానికి అనుగుణంగా మీ తిండి అలవాట్లను మార్చుకోండి' అని నినాదాలు చేశారు. "కొన్ని కంపెనీలు ప్రత్యామ్నాయాలలో నిమగ్నమై ఉన్నాయని నాకు తెలుసు. కానీ ప్రభుత్వాలు వారి సబ్సిడీలతో ప్రత్యామ్నాయ శక్తికి అనుకూలంగా వ్యవస్థను మార్చాలని నేను భావిస్తున్నాను" అని నిరసనలో పాల్గొన్న 99 % సంస్థ సభ్యులు హీథర్ స్మిత్ చెప్పారు. "పెరుగుతున్న వడ్డీ రేట్లు పునరుత్పాదక ఇంధన అభివృద్ధికి ఫైనాన్సింగ్‌ను ఆకర్షించడం కష్టతరం చేశాయి. శిలాజ ఇంధన పెట్టుబడుల నుంచి ఇంకా చాలా ఎక్కువ డబ్బు సంపాదించాల్సి ఉన్నది" అని తెలిపారు.

సైన్యంలో అగ్నివీరులు కీలక పాత్ర

- తొలి బ్యాచ్‌తో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సైన్యంలో అగ్నివీరులు కీలక పాత్ర పోషించనున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సోమవారం డిఫెన్స్ ఫోర్స్‌లో చేరిన వివిధ రెజిమెంట్ సెంటర్లలోని అగ్నివీరుల తొలి బ్యాచ్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్నారు. గోవా, హైదరాబాద్, మద్రాస్, పుణె, మధ్యప్రదేశ్‌లోని సాగర్, హిమాచల్ ప్రదేశ్‌లోని సబాతులో శిక్షణ పొందుతున్న వారితో ప్రధాని మాట్లాడారు. ఈ విధానం సాయుధ బలగాలను పటిష్ఠం చేయడంలో కీలకంగా మారుతుందని, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంచుతుందని పేర్కొన్నారు. యువ అగ్నివీరులు సాయుధ దళాలను మరింత యువోత్సాహం, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన శక్తిగా మారుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అగ్నివీరులుగా పొందే అనుభవం జీవితానికి గర్వకారణంగా ఉంటుందని తెలిపారు. అగ్నిపథ్ పథకం మహిళలకు మరింత సాధికారత కల్పిస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. పర్సనల్ బిలో ఆఫీసర్ ర్యాంకు (పిబిఒఆర్) కింద సుమారు 25,000 మంది సిబ్బంది తొలి బ్యాచ్‌లో అగ్నివీరులుగా శిక్షణ పొందుతున్నారు. ఇండియన్ ఆర్మీలో 19,000 మందిని, ఇండియన్ నేవీ, ఇండియన్ ఎయిర్‌పోర్స్‌ర్స్‌లో చెరో 3,000 మందిని ఎంపిక చేశారు.

ఢిల్లీలో ర్యాలీ నిర్వహిస్తున్న కేజ్రీవాల్, ఆప్ ఎమ్మెల్యేలు

ఎల్‌జి తీరుకు నిరసనగా కేజ్రీవాల్, ఎమ్మెల్యేల ర్యాలీ

న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయాల్లో లెఫ్టినెంట్ గవర్నర్ జోక్యాన్ని వ్యతిరేకిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం ప్రదర్శన చేపట్టింది. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆధ్వర్యాన ఆప్ ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఢిల్లీ పాఠశాల ఉపాధ్యాయులను శిక్షణ కోసం ఫిన్‌లాండ్‌కు పంపే ప్రతిపాదనను ఎల్‌జి కార్యాలయం తిరస్కరించడంపై ఆప్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇది ఢిల్లీ ప్రజలచే ఎన్నుకోబడిన ప్రభుత్వం. ఢిల్లీ ప్రజలు పన్నుల రూపేణా చెల్లించిన నగదును, విద్య కోసం ఖర్చు చేస్తున్నామని, దీనివల్ల ఎల్‌జికి వచ్చిన సమస్య ఏమిటని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఢిల్లీ సిఎం, ఎమ్మెల్యేలు ఎల్‌జి కార్యాలయానికి ర్యాలీ చేపట్టాల్సిరావడం దురదృష్టకరమని అన్నారు. ఎల్‌జి తన తప్పు తెలుసుకుని, ఉపాధ్యాయులను ఫిన్‌లాండ్‌కు అనుమతిస్తారని ఆశిస్తున్నానని కేజ్రీవాల్ మీడియాతో అన్నారు. 2018 నాటి సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రస్తావిస్తూ.. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేరని అన్నారు.

వన్య ప్రాణుల దాడుల నుంచి రక్షణ కల్పించండి : ఎఐకెఎస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : పెరుగుతున్న వన్య ప్రాణుల దాడుల నుంచి ప్రజల ప్రాణాలను, పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. కేరళలోని వాయనాడ్ జిల్లా మనంతవాదీ తాలూకాకు చెందిన థామస్ (50) తన ఇంటి పరిసరాల్లోనే పులి దాడి చేయడంతో ప్రాణాలు కోల్పోయాడు. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వారి కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని ఇచ్చి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిచ్చింది. ఆ పులిని తర్వాత బంధించారు. కుటుంబంలో ఒక వ్యక్తి చనిపోతే ఆ నష్టాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అయినా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం సున్నిత ధోరణితో వ్యవహరించిందని ఎఐకెఎస్ తెలిపింది. అడవులు, వన్య ప్రాణి సంరక్షణ విభాగం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, అందువల్ల కేంద్రం కూడా కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలోని అర్హులైన వారికి ఉద్యోగాలివ్వాలని ఎఐకెఎస్ కోరింది. వన్య ప్రాణుల దాడుల నుండి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని తెలిపింది. జంతువుల దాడుల ముప్పు కారణంగానే సారవంతమైన నేలలున్నా వేలాది హెక్టార్ల భూములను సాగు చేయకుండా వదిలిపెడుతున్నారని కిసాన్ సభ పేర్కొంది. తీవ్రమైన భయం, మానసిక ఆందోళనలతో ప్రజలు జీవిస్తున్నారని తెలిపింది. ఇటీవలి కాలంలో వన్య ప్రాణుల దాడుల్లో మరణిస్తున్న వారి సంఖ్య రెట్టింపు అయింది. దేశవ్యాప్తంగా ఏనుగుల దాడుల్లో 300మందికి పైగా మరణించారు. సగటున ప్రతి ఏడాది వెయ్యి మందికి పైగా వన్య ప్రాణుల దాడుల్లో చనిపోతున్నారని కిసాన్ సభ తెలిపింది. బాధిత ప్రాంతాలను గుర్తించి, వాటి చుట్టూ నాలుగు మీటర్ల ఎత్తైన వైరింగ్ చేసి, రక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ పనులను మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద చేయించాలని సూచించింది. ఈ డిమాండ్లు నెరవేరేవరకు రాష్ట్రస్థాయిలో, కింది స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని ఎఐకెఎస్ పిలుపునిచ్చింది.

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

- 68 మంది మృతి
- మరో నలుగురి కోసం గాలింపు
- బ్లాక్ బాక్స్‌లు లభ్యం
- జాతీయ సంతాపదినం ప్రకటించిన నేపాల్

సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

అంజు ఖటివాడా

ఖాట్మండు : నేపాల్‌లో గత 30ఏళ్లలో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదంలో రెండు బ్లాక్ బాక్స్‌లు-కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్‌డేటా రికార్డర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రమాద స్థలంలోనే బాక్స్‌లు దొరికాయని, ఇప్పటికే దాన్ని నేపాల్ పౌరవిమాన యాన సంస్థ (సిఎఎఎన్)కి అందజేసినట్లు యతి ఎయిర్‌లైన్స్ ప్రతినిధి సుదర్శన్ బర్తాలా మీడియాకు తెలిపారు. విమానం కూలిపోయినప్పుడు మొత్తంగా విమానంలో 72మంది వున్నారు, వారిలో 68 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వాతావరణం బాగానే వున్నప్పటికీ మరో ఐదు నిముషాల్లో ల్యాండ్ అవుతుందనగా, పోఖారా నగరంలో విమానం కూలిపోయింది. కాగా, ఆదివారం రాత్రి నిలిపివేసిన గాలింపు చర్యలను సోమవారం ఉదయమే పునరుద్ధరించారు. 300మీటర్ల లోతైన గోతిలోకి దిగి సహాయక, గాలింపు బృందాలు తమ చర్యలను చేపట్టిన వెంటనే బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు జరిగాయి. ఖాట్మండులోని త్రిభువన్ యూనివర్శిటీ టీచింగ్ హాస్పిటల్‌కి చెందిన వైద్య బృందం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని బర్తాలా తెలిపారు.

ఖాట్మండు నుండి పోఖరాకి వెళుతున్న ఈ విమానంలో ఐదుగురు భారతీయులు వున్నారు. సోమవారం జాతీయ సంతాపదినంగా నేపాల్ ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. భవిష్యత్తుల్లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వుండేలా తీసుకోవాల్సిన చర్యలను సూచించాల్సిందిగా కోరింది. మృత దేహాలను గుర్తించిన తర్వాత, వారి కుటుంబాలకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

యుపి ప్రయాణికుడి ఫేస్‌బుక్ లైవ్‌లో నేపాల్ విమాన ప్రమాద దృశ్యాలు

విమానంలో ప్రయాణిస్తున్న ఐదుగురు భారతీ యుల్లో నలుగురు యుపిలోని ఘజియా పూర్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. వారిలో సోనూ జైస్వాల్ తనకు కొడుకు పుట్టినందుకు పశుపతినాథ్ ఆలయంలో మొక్కు తీర్చుకోవడానికి తన స్నేహితులు ముగ్గురితో కలిసి నేపాల్ వెళ్లాడు. వారిలో ఒకరు ఫేస్‌బుక్ లైవ్‌లో వుండి, 1.30నిముషాల వీడియోను పంపిస్తూ, 'ఆనందించాం' అనడం వినిపిస్తోంది. ఒక్కసారిగా విమానం ప్రమాదకరమైన రీతిలో మలుపు తిరిగి మంటల్లో చిక్కుకోవడం ఆ వీడియోలో కనిపిస్తోంది. సోనూ జైస్వాల్‌కు ఇద్దరు కుమార్తెలు వున్నారని, ఈసారి కొడుకు పుడితే పశుపతినాథ్ ఆలయానికి వస్తానని మొక్కుకున్నాడని, ఆరు నెలల క్రితం కొడుకు పుట్టడంతో స్నేహితులతో కలిసి మొక్కు తీర్చుకోవడానికి వెళ్ళాడని జైస్వాల్ బంధువు ఒకరు మీడియాకు తెలిపారు.

ప్రాణాలు కోల్పోయిన కో పైలెట్ అంజు ఖటివాడా

ప్రమాదానికి గురైన యతి ఎయిర్‌లైన్స్ ఏటీఆర్-72 విమానానికి సీనియర్ కెప్టెన్ కమల్ కేసీ పైలట్‌గా ఉండగా.. అంజు కో-పైలట్‌గా వ్యవహరించారు. నేపాల్ నిబంధనల ప్రకారం.. పైలట్ అవ్వాలంటే కో-పైలట్‌గా 100 గంటల పాటు విమానం నడిపిన అనుభవం ఉండాలి. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు అంజు నేపాల్‌లోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో విమానాలను విజయవంతంగా దించారు. కో-పైలట్‌గా ఏటీఆర్-72 విమానం ఆమెకు చివరిది. ఆదివారం నాటి ఈ విమానాన్ని ల్యాండ్ చేసిన తర్వాత ఆమె పైలట్‌గా లైసెన్స్ పొందేవారు. తన కలల్ని నిజం చేసుకోవడానికి కేవలం కొన్ని నిమిషాలే ఉండగా.. ఈ విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో అంజుతో సహా విమానంలో ఉన్నవారంతా ప్రాణాలు కోల్పోయారు. అంజు భర్త దీపక్ పోఖ్రెల్ కూడా 16 ఏళ్ల క్రితం యతి ఎయిర్‌లైన్స్‌కు పనిచేస్తూ ఇలాంటి విమాన ప్రమాదంలోనే ప్రాణాలు కోల్పోయారు. 2006 జూన్ 21న దీపక్ కో-పైలట్‌గా వ్యవహరించిన యతి ఎయిర్‌లైన్స్ విమానం ఒకటి నేపాల్‌గంజ్ నుంచి జుమ్లా వెళ్తుండగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అందులో దీపక్ కూడా ఒకరు.

మృతుల్లో జానపద గాయని..

ఈ ప్రమాదంలో నేపాల్‌కు చెందిన ప్రముఖ జానపద గాయని నీరా ఛంతియల్ మరణించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని పొఖారాలో ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ప్రమాదానికి కొద్ది గంటల ముందే "పొఖారాలో ఆనందాన్ని ఆస్వాదించేందుకు సిద్ధంగా ఉన్నా' ఆమె సోషల్‌మీడిలో పోస్ట్ చేశారు. ఈలోగానే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం విచారకరం.

రష్యా క్షిపణి దాడిలో 36కి పెరిగిన మరణాలు!

కీవ్ : ఉక్రెయిన్ నగరమైన డినిప్రోలో అపార్ట్‌మెంట్ భవనంపై రష్యా జరిపిన క్షిపణి దాడిలో మృతుల సంఖ్య ఆదివారానికి 36కి చేరుకుందని ఉక్రెయిన్ జాతీయ అత్యవసర సర్వీసుల విభాగం తెలిపింది. శనివారం దాడి జరగడానికి ముందు ఆ భవనంలో 1700మంది వుండేవారని అధికారులు తెలిపారు. శనివారం నాటి దాడిలో రష్యా 33 క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించిందని, అందులో 21 క్షిపణులను కూల్చివేసినట్లు ఉక్రెయిన్ కమాండర్ ఇన్ చీఫ్ జనరల్ వాలెరి జలూజినీ తెలిపారు. పౌర ఆవాసాలను లేదా సామాజిక మౌలిక వసతులను రష్యా సాయుధ బలగాలు ఎన్నడూ లక్ష్యంగా చేసుకోవని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. వైమానిక రక్షణ క్షిపణుల దాడుల ఫలితంగా ఈ విషాదం జరిగి వుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank

శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్‌హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068.

ఏదైతే
దిగువ సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆథీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపల దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్థి వివరణ/భౌతిక స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ)	శాఖ పేరు
1.	1. పొనుగుబటి కృష్ణ/ పొనుగుబటి సుజాత LBGTR00005232026	గుంటూరు జిల్లా, గుంటూరు ఉపజిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, కొరిటెపాడు గ్రామం డో.నం.272, కవర్ చేయబడిన పరిధిలో ఎసి.5.56 సెంట్లు, మరియు అదే విభజించిన అందులో ఒక ప్లాట్ ఆ ప్లాట్ బేరింగ్ కవరింగ్ పరిధిలో 448.5 చ.గజాలు. ఖాళీ సైట్ ఉన్న హద్దులు: తూర్పు: సాయి సాంబశివ టవర్స్ 55.6 అడుగులు., దక్షిణం: 30 అడుగుల వెడల్పు రోడ్డు 72.6 అడుగులు., పడమర: 20 అడుగుల వెడల్పు రోడ్డు 55.6 అడుగులు., ఉత్తరం: ఇతరులకు చెందిన ఆస్తి 72.6 అడుగులు. భౌతిక స్వాధీనతా తేది: 11.01.2023	11/10/2022 Rs. 80,65,445.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.
తేది: 17 జనవరి, 2023, ఆథీకృత అధికారి,
ప్రదేశం: గుంటూరు. ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్.

దినా గద్దె దిగాల్సిందే

- పెరూలో భారీ ర్యాలీ

లిమా : పెరూ అధ్యక్షురాలు దినా బొలూర్టె రాజీనామా చేయాలని కోరుతూ వేలాదిమంది ప్రజలు రాజధాని లిమాకు ప్రదర్శనగా బయలుదేరారు. "మార్చ్ ఆఫ్ ది ఫోర్ రీజియన్స్' రెండో దఫా కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రావిన్స్‌ల నుండి బయలుదేరిన వారిలో ఆయమారా, క్వెచువా కమ్యూనిటీలకు చెందినవారు, సామాజిక సంస్థలకు, ఇతర విభాగాలకు చెందినవారు వున్నారు. అధ్యక్షురాలు రాజీనామా చేయాలని, పార్లమెంట్‌ను మూసేయాలని, రాజ్యాంగ నిర్ణయాక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, మాజీ అధ్యక్షుడు పెడ్రో కేస్టిలోను విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. డిసెంబరు 7న పెడ్రోను పార్లమెంట్ తొలగించింది. అప్పటి నుండి దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. భద్రతా దళాలు వాటిని హింసాత్మక చర్యలతో అణచివేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటివరకు 50మంది మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. వందలాదిమందిని అదుపులోకి తీసుకున్నారు. రెండు వేలు సంవత్సరంలో మొదటిసారిగా 'మార్చ్ ఆఫ్ ది ఫోర్ రీజియన్స్' పేరుతో జరిగిన ప్రదర్శనలో వేలాదిమంది పాల్గొని అప్పటి అధ్యక్షుడు అల్బర్టో ఫ్యుజిమోరి మూడోసారి అక్రమంగా ఎన్నికవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. "పెరూలో పౌర యుద్ధం జరుగుతోంది. పెరూ ప్రతిఘటిస్తోంది." అని బలంగా నినదిస్తూ ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారు. వేలాదిమంది ప్రజలు పెరూ చేరుకుని అధ్యక్షురాలు రాజీనామా చేసేవరకు అక్కడే వుంటారని సెంట్రల్ యూనియన్ ఆఫ్ పెజంట్ రౌండ్ అధ్యక్షులు సావెద్రా తెలిపారు.

గృహ సముదాయం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ
భారత ప్రభుత్వం

స్వచ్ఛత నాలెడ్జెస్ పార్టనర్స్‌ను ఉపాధి కల్పించుట కొరకు ఆసక్తి వ్యక్తపరుచుట

గృహసముదాయం & పట్టన వ్యవహారాల మంత్రిత్వశాఖ వారు ఇందుమూలంగా సంబంధిత ఆసక్తిగల సంస్థల నుండి స్వచ్ భారత్ మిషన్ (అర్బన్) 2.0 క్రింద నిర్మాణ సామర్థ్యం కొరకు 'స్వచ్ఛత నాలెడ్జి పార్టనర్స్ (ఎస్‌కెపిలు)గా సంస్థల ఎంప్యానెల్‌మెంట్ కొరకు ఆసక్తి వ్యక్తపరుచుటను కోరుతున్నారు.

వివరణ: ఎస్‌కెపిలుగా ఎంఒహెచ్‌యుఎ ద్వారా ఎంప్యానెల్డ్ సంస్థలుకు స్వచ్ భారత్ మిషన్ (అర్బన్) వారి ఆశయాలతో అలైన్‌మెంట్‌లో రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు యుఎల్‌బిలతో పని కల్పించబడుతుంది. **స్వఛత నాలెడ్జి పార్టనర్స్** (ఎస్‌కెపిలు) సరైన విధంగా డిజైన్ మరియు సిటి మరియు రాష్ట్ర అధికారుల సామర్థ్యం మేరకు నిర్మాణం ద్వారా సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా డెలివర్‌చేయబడుతుంది. ఎస్‌కెపిలు శిక్షణ మరియు హ్యాండ్‌హోల్డింగ్ సెష్షన్స్ ద్వారా ఎస్‌బిఎం(యు) 2.0 క్రింద రాష్ట్ర/కేంద్ర పాలిత శాఖ మరియు యుఎల్‌బిల ఎగ్జిక్యూటివ్ & టెక్నికల్ అధికారుల సామర్థ్యంగా నిర్మించు సామర్థ్యంను మెరుగుపరుచుట కొరకు ప్రైమరీ సపోర్ట్ రిసోర్స్ చేయబడుతుంది.

ఇఒఐ దాఖలుచేయుట కొరకు చివరి తేది & సమయం- 30 జనవరి, 2023.

పని విధాన వివరాలు, ఎస్‌కెపిల దరఖాస్తుదారుల గణాంకాలు, ఎస్‌కెపిల ఎంపిక మరియు రోల్స్ & నాలెడ్జి పార్టనర్స్ యొక్క బాధ్యత కొరకు నియమాలు & నిబంధనలును https://skp.sbmurban.org/u/login నుండి లేదా క్యూఆర్ కోడ్ వినియోగించి డౌన్‌లోడ్‌చేసుకోవచ్చును.

ఆసక్తిగల సంస్థలను ఇఒఐ దాఖలుచేయుటకు చివరి తేదీ నాటికి https://skp.sbmurban.org/u/login వద్ద అప్‌లోడింగ్‌చేయుట ద్వారా మద్దతు పత్రాలతోసహా వారి దరఖాస్తులను దాఖలుచేయవలసిందిగా కోరబడుచున్నది.

సం/-డైరెక్టర్

cbc 20101/11/0003/2223

మీకోసం

రసం పిండిన నిమ్మ కాయ చెక్కలతో కత్తులు, కత్తిపీటలు తుడిస్తే వాటికి అంటిన ఉల్లిపాయ వాసన పోతుంది.

జీవన సౌరభం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం ప్రతి మనిషికి అవసరం.

విజ్ఞాన యాత్ర

చకచక రైలు వచ్చింది
అమరావతి వెళ్ళాము
రాతి శిల్పాలు చూశాము
బుద్ధుని బోధలు విన్నాము

కారులో నల్లమల తగిలింది
వంకర టింకర తిరిగాము
పక్షుల అరుపులు విన్నాము
అడవి అందం చూశాము

శ్రీశైలం ప్రాజెక్టు చేరాము
విద్యుత్తు ఉత్పత్తి చూచాము
కృష్ణానదిలో పడవనెక్కాము
ఆనందంగా విహరించాము

వేవేగమె బస్సు ఎక్కాము
హైదరాబాదు చేరాము
చార్మినారును చూశాము
గోల్కొండ నంతా తిరిగాము

విశాఖ విమానమొచ్చింది
ఆకాశంలో ఎగిరాము

సముద్రంలో మునిగాము
ఉప్పు తయారి తెలిసింది

రాకెట్లు దూసుకుపోయాము
శ్రీహరి కోటను చేరాము
శాస్త్రజ్ఞానము పొందాము
సైంటిస్టవ్వాలనుకున్నాము

- ఆవుల చక్రపాణి యాదవ్
99633 50973

సరైన నీడ ఏది?



చిన్నారులూ, ఇక్కడ తెల్లని బాతు ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 5

నేను గీసిన బొమ్మ

- బి. సిద్ధార్థ
8వ తరగతి,
శశి స్కూలు,
తణుకు.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అఘాయిత్యం.. ఆపై వెంటాడిన అన్యాయం!

'నేను పెద్దాయ్యాక పోలీసాఫీసర్ కావాలనుకున్నాను..' అంటున్న ఆ మైనర్ ఉత్తరప్రదేశ్ కౌశాంబి జిల్లా ఓ మారుమూల ప్రాంతంలో నివసిస్తోంది. రోటీలు చేసుకునేందుకు గోధుమలు పిండి చేసుకునే ఆర్థిక స్థోమత కూడా లేని కుటుంబం వారిది. 13 మంది గల ఆ కుటుంబం ఏకైక నివాసం మట్టితో కట్టిన ఇల్లు. కరెంటు లేదు. చలి నుండి రక్షించుకునే వెచ్చని దుస్తులు, షూస్ లేవు. వీధుల్లో వేసిన చలిమంటలే వణికించే చలి నుండి వారిని రక్షించేవి. ఇంతటి దీనస్థితిలో ఉన్న ఆ కుటుంబ బిడ్డ 13 ఏళ్ల మైనర్‌పై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు.

'ఏంటి ఇక్కడే తగలడ్డారు? ఇది మీ ఇల్లు కాదు. కోర్టుకెళ్లి ముందు కేసు సెటిల్ చేసుకురండి' అంటూ గర్భవిచ్ఛిత్తి ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్న ఆ తండ్రీకూతుళ్లను ఆస్పత్రి సిబ్బంది చీదరించుకునేవారు. ఆ మాటలు భరిస్తూనే మూడునెలలు జిల్లా ఆస్పత్రిలో పడిగాపులు పడ్డారు వారు. ఆస్పత్రి వారు ఇచ్చిన ప్లేటు భోజనం కూతురుకు పెట్టి సమోసాలు తిని పొట్ట నింపుకునేవాడు ఆ తండ్రి. ఏమీ తినకుండా పస్తులు పడుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంత ప్రయాసపడినా వారు కోరుకున్నది జరగలేదు. సమయం మించిపోయిందని గర్భవిచ్ఛిత్తి వీలుకాదని కోర్టు ఆదేశించింది. ఫలితం 13 ఏళ్ల ఓ మైనర్ నెలల నిండకుండానే బిడ్డకు జన్మనిచ్చింది. ఆ బిడ్డ ఇప్పుడు ఎవరికీ అక్కర్లేని బిడ్డ..

న్యాయం జరిగినట్లేనా..

ఘోరం జరిగిన మూడు నెలల తరువాత ఒక రోజు పాప అస్వస్థతకు గురైంది. వైద్యులు ఆమెకు గర్భిణీ అని తేల్చారు. ఆ క్షణం.. తమ కళ్ల ముందు ఏం జరుగుతోందో.. అసలేం చేయాలో కూడా తెలియని అయోమయ పరిస్థితి ఆ కుటుంబానిది. కూచోని ఏడిస్తే సరిపోదని.. ఎలాగైనా కూతురుకు న్యాయం జరగాలని, నిందితుడికి శిక్ష పడాలని.. కొన్ని రోజుల తర్వాత పోలీసు స్టేషను గుమ్మం ఎక్కాడు పాప తండ్రి. అయితే తన కూతురిపై అత్యాచారం జరిగిందని, న్యాయం చేయమని అర్థించిన అతడిని నిర్దాక్షిణ్యంగా పోలీసులు గెంటివేశారు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి బాగా తెలిసిన స్థానిక జర్నలిస్టు చొరవతో ఎట్టకేలకు 2022 ఆగస్టు 8న పోలీసులు కేసు ఫైల్ చేశారు. అప్పటికే పాప 18 వారాల గర్భవతి. రెండు రోజుల తరువాత సెక్షన్ 376(3), 511, 'పోక్సో' చట్టాల కింద కేసు నమోదు చేసి నిందితుణ్ణి అరెస్టు చేశారు. ఇక్కడితో ఆ మైనర్‌కు న్యాయం జరిగినట్లేనా..

అసలు కష్టం ఆమెకు ఇప్పుడే మొదలైంది. ఆరోతరగతి చదువుతున్న పాపపై కన్నేసిన పక్కింటివాడు మాయమాటలు చెప్పి ఆమెను లోబరుచుకోవడం, ఈ విషయం ఎవరికైనా చెబితే తల్లిదండ్రులను చంపేస్తానని బెదిరించడం వల్ల జరిగిన దారుణం బయటపడడానికి తీవ్ర ఆలస్యమైంది. కానీ, గర్భం దాల్చిన తమ బిడ్డ భవిష్యత్తు గురించి బెంగపడిపోయిన ఆ కుటుంబం ఎలాగైనా ఆ గర్భం వదిలించుకోవాలని నిశ్చయించుకొంది.

చట్టం ఏం చెబుతోంది..

2021లో మన దేశంలో మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) చట్టానికి సవరణలు చేశారు. దాని ప్రకారం అత్యాచార బాధితులు, మైనర్లు, కొన్ని ప్రత్యేక వర్గాల మహిళలు గర్భస్రావం చేయించుకునే పరిమితి 20 వారాల నుండి 24 వారాలకు పొడిగించారు. ఈ విషయాలేవీ ఆ కుటుంబానికి తెలియవు. సెప్టెంబరు చివరి వారంలో మళ్లీ పాప ఆరోగ్యం దెబ్బతిని 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ఆస్పత్రిలో చేరింది. అప్పటికే గర్భవిచ్ఛిత్తి కోసం ఎన్నో ప్రయత్నాలు చేసిన ఆ కుటుంబం ఆ ఆస్పత్రిలోనైనా ఆ ప్రక్రియ చేయమని బతిమాలుకుంది. కానీ, ఇప్పటికే 24 వారాలు దాటిందని కోర్టు ఆర్డరు కచ్చితంగా కావాలన్నారు.

ఈసారి న్యాయస్థానం గుమ్మం ఎక్కాడు పాప తండ్రి. అక్టోబరు 15న చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఓ కమిటీ ఏర్పాటుచేయాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను కోర్టు ఆదేశించింది. ఇంతటి తీవ్ర సమస్యపై చీఫ్ స్పందించేసరికి మైనర్‌కు 30 వారాల గర్భం దాటింది. ఈ సమయంలో గర్భవిచ్ఛిత్తి చేస్తే మైనర్ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని కమిటీ నిర్దేశించింది.

ఈ నరకయాతనకి కారకులెవరు..

ఈ మధ్యకాలంలో తన బాల్యాన్ని చిదిమేసిన ఘాతుకాన్ని తలచుకొంటూ.. నిత్యం నరకయాతన అనుభవించిన పాప ఆరోగ్యం ఇంకా క్షీణించింది. మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. 'ఆ పెద్దాసుపత్రిలో సౌకర్యాలు బాగానే ఉన్నా. ఆ ఖర్చు భరించే స్థోమత మాకు లేదు. నా కూతురు బాధ చూడలేకపోయాను. దోషిని జైల్లో పెట్టడంతోనే మాకు న్యాయం జరిగినట్లా? ఇప్పుడు మేం అనుభవిస్తున్న నరకానికి కారణమెవరు? ఆగస్టు 10న నిందితుణ్ణి పట్టుకుంటే మూడు నెలలు తిరిగినా గర్భవిచ్ఛిత్తి కోసం మేం పెట్టుకున్న అభ్యర్థనలపై సకాలంలో ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు మాకు దిక్కెవరు? నా బిడ్డ బతుకు దుర్భరమైంది' అంటూ ఆ తండ్రి విలవిలలాడిపోయాడు.

ఎక్కడికెళుతుందో తెలియదు..

జరిగిన నష్టం, అక్కరకు రాని చట్టం, సకాలంలో స్పందించని న్యాయంతో సంబంధం లేని కడుపులోని బిడ్డ నెలలు నిండకుండానే బయటికొచ్చింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇప్పటికీ ఆస్పత్రిలోనే ఉంది. వార్డులో ఇతర పిల్లలు తాగగా మిగిలిన పాలు తాగుతూ ఊపిరితీసుకుంటోంది. ప్రభుత్వ సాయమందితేనే ఆ బిడ్డకు బట్టలు, పాలు, ఇతర సౌకర్యాలు అందుతున్నాయి. 'ఆరోగ్యం కుదుటపడ్డాక ఈ బిడ్డ ఎక్కడికి వెళుతుందో మాకు కూడా తెలియదంటు'న్నారు ఆస్పత్రి సిబ్బంది..

మమ్మల్ని చూసి నవ్వుతున్నారు..

'స్కూలుకెళుతున్న పిల్లపై అత్యాచారం జరిగిందని చుట్టుపక్కల గ్రామాలకు కూడా తెలిసిపోయింది. అందరూ మమ్మల్ని చూసి నవ్వుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆ బిడ్డను మాతో ఉంచుకుంటే మా మిగిలిన ఆడపిల్లలను ఎవరు పెళ్లి చేసుకుంటారు' అంటూ కన్నీటిపర్యంత మౌతోంది పాప తల్లి. 'గ్రామంలో నిత్యం అవమానాలు ఎదుర్కొంటూ బతుకుతున్నాం. ఒక్కోసారి భయంతో నిద్ర పట్టడం లేదు. ఇంటిని అమ్మేసి బయటికి వెళ్లాలనుకున్నా రెండు పూటల తిండి తినే స్థోమత లేదు' అంటున్నాడు పాప తండ్రి.

ఈ కుటుంబం, ఈ పిల్ల పడిన, పడుతున్న బాధలు, కష్టాలు ఎంతోమంది అత్యాచార బాధితులవి. నిందితులను అరెస్టు చేయడం, శిక్ష పడడంతోనే వీరికి న్యాయం జరగడం లేదని బతికున్నంత వరకు ఘటన తాలూకా భయంకర పరిస్థితులు, దాని పర్యావసానాలు వారిని, వారి కుటుంబాలను జీవచ్ఛవల్లా చేస్తున్నాయనడానికి ఈ మైనర్ జీవితం నిదర్శనం.



'స్పిరిట్' షూటింగ్ ఏడాది చివరికే

సందీప్‌రెడ్డి వంగా, ప్రభాస్ కాంబినేషన్‌లో రాబోతున్న 'స్పిరిట్' సినిమా నుంచి తాజా సమాచారం ఒకటి బయటికి వచ్చింది. ఈ సినిమా నిర్మాత భూషణ్‌కుమార్ కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం సందీప్‌రెడ్డి 'యానిమల్' సినిమా షూటింగ్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత ప్రభాస్ సినిమా పనులు మొదలుపెడతారు. ఈ ఏడాది చివరిలో ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టే అవకాశం ఉంది. ఇది చాలా ప్రత్యేకమైన సినిమా. పోలీస్ డ్రామాగా తెరకెక్కనుంది. ఇందులో ప్రభాస్ తొలిసారి ఖాకీ దుస్తులు ధరించి, లాఠీ ఝుళిపించనున్నారు. అలాగే ఈ సినిమాకు సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ చిత్రంలో మునుపెన్నడూ చూడని ప్రభాస్‌ని చూస్తారు' అని తెలిపారు.

కార్తీ 'జపాన్' లుక్

రాజు మురుగన్ దర్శకత్వంలో తమిళ నటుడు కార్తి 'జపాన్' అనే చిత్రంలో నటిస్తున్నారు. పీరియాడిక్ టచ్‌తో కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమా నుండి కార్తీ లుక్ బయటికి వచ్చింది. సంక్రాంతి సందర్భంగా చిత్ర నిర్మాతలైన డ్రీమ్ వారియర్ మరో ఆసక్తికరమైన పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయడానికి చిత్ర నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

'మైఖేల్' పూర్తి..

సందీప్ కిషన్ నటిస్తున్న 'మైఖేల్' చిత్ర షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. రంజిత్ జయకోడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివ్యాన్ష కౌశిక్ కథానాయికగా నటించారు.. తాజా సమాచారం ప్రకారం సినిమా షూటింగ్ పూర్తయిన విషయాన్ని మేకర్స్ తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రకటించారు. అలాగే ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను జనవరి 21, 2023న విడుదల చేయనున్నట్లు తెలిపారు. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, వరలక్ష్మి శరత్‌కుమార్, అనసూయ భరద్వాజ్, వరుణ్ సందేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్పి సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించాయి. సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 3, 2023న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానున్నది.

27న ఓటీటీలో '18 పేజెస్'

నిఖిల్ సిద్దార్థ్ హీరోగా, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన '18 పేజెస్' చిత్రం డిజిటల్ ప్రీమియర్‌గా రాబోతోంది. ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకున్న నెట్ ఫ్లిక్స్‌లో ఈ నెల 27 నుంచి స్ట్రీమింగ్‌కానుంది. ఆహా వీడియోలో కూడా అదే తేదీ నుండి ప్రసారం కానుంది. సుకుమార్ స్టోరీ అందించిన ఈ చిత్రానికి కుమారి 21 ఎఫ్ ఫేమ్ డైరెక్టర్ పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించారు. జీఏ2 పిక్చర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి గోపి సుందర్ సంగీతం అందించారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్నా..

మమతా మోహన్ దాస్ పేరు తెలియని తెలుగు సినీప్రియులు ఉండరు. ఎన్‌టిఆర్ నటించిన 'యమదొంగ' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైన మలయాళ నటి మమతా మలయాళ చిత్రాలతో పాటు తమిళ, తెలుగు సినిమాల్లోనూ నటించారు. గతంలో క్యాన్సర్ బారిన పడిన ఆమె ఆ తర్వాత కోలుకుంది. మరోసారి లింఫోమా అనే వ్యాధితో పోరాడి కోలుకున్నారు. రెండు భయంకరమైన వ్యాధులను జయించిన ఈ నటి తాజాగా మరో వ్యాధి సోకినట్లు తెలుస్తోంది.

ఈ విషయాన్ని తన ఇన్‌స్టా వేదికగా మమతా స్వయంగా వెల్లడించారు. 'తాను ప్రస్తుతం బొల్లి వ్యాధితో బాధపడుతున్నట్లు. ఈ వ్యాధి తన చర్మం రంగును కోల్పోయేలా చేస్తోందని తెలిపారు. క్రానిక్ ఆటో ఇమ్యూన్ డిజార్డర్‌తో బాధపడుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఫొటోను షేర్ చేశారు. 'నువ్వు ఒక ఫైటర్‌వి. క్యాన్సర్ జయించినట్లే ఇప్పుడు కూడా కోలుకోవాలని ఆ పోస్ట్ చూసిన స్నేహితులు, అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

మహిళల ఐపిఎల్ ప్రసార హక్కులు

వియాకామ్ సొంతం

ఒక్కో మ్యాచ్‌కు రూ.7.09కోట్లు.. ఐదేళ్లకు రూ.951కోట్లు

ముంబయి: మహిళల ఐపిఎల్ ప్రసార హక్కులకూ భారీ ధర లభించింది. బిసిసిఐ సెక్రటరీ జే షా సోమవారం ట్విటర్ వేదికగా మహిళల ఐపిఎల్ ఐదేళ్ల ప్రసార హక్కులను వియాకామ్-18 కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2023-27సర్కిల్ పరిధిలో భాగంగా వియకామ్ ఒక్కో ఐపిఎల్ మ్యాచ్‌కు రూ.7.09కోట్లు చొప్పున బిసిసిఐకి చెల్లించనుంది. ఈ ఐదేళ్ల కాలంలో వియకామ్-18 ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ ప్రసార, డిజిటల్ హక్కులు కలిగి ఉంటుంది. ప్రసార హక్కులు కొనుగోలుకు డిస్నీ స్టార్, సోనీ, జీ కూడా పోటీపడ్డాయి. ఈ ఏడాది నుంచి మహిళల ఐపిఎల్‌లో బిసిసిఐ కొత్త మార్పులకు తెరలేపనుంది. జట్ల సంఖ్యను ఐదుకు పెంచనుంది. మహిళల ఐపిఎల్‌లో ఆడే క్రీడాకారిణులు రూ.10 నుంచి రూ.50లక్షలకు రూపాయలు బేస్ ధరతో వేలం బరిలో నిలవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ క్రీడాకారిణులు మాత్రం రూ.30, 40, 50లక్షల బేస్ ధరను నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. మిగతా వారంతా మినిమమ్ రూ.10 నుంచి 20లక్షలు మాత్రమే కోట్ చేయాల్సి ఉంటుంది. ఇక మహిళల ఐపిఎల్ వేలం జనవరి 26న జరగనుంది.

టీమిండియా రికార్డు గెలుపు

శ్రీలంకపై 317పరుగుల తేడాతో విజయం

వన్డేలో సిరీస్ క్లీన్‌స్వీప్

తిరువనంతపురం: శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో గెలిచి క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా 317పరుగుల భారీ తేడాతో గెలిచి రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 390 పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంక జట్టు 22 ఓవర్లలో 73పరుగులకే కుప్పకూలింది. తొలుత విరాట్ కోహ్లి (166నాటౌట్) వన్డేల్లో 46వ సెంచరీని, ఓవరాల్‌గా 74వ సెంచరీకి తోవడు ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కూడా (116పరుగులు)సెంచరీ కదం తొక్కాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 131పరుగులు జతచేశారు. తొలుత రోహిత్-గిల్ కలిసి 15.2ఓవర్లలో 95పరుగులు జతచేశారు. రజితకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత మహ్మద్ సిరాజ్(4/32) బౌలింగ్‌లో రాణించడంతో శ్రీలంక జట్టు 73పరుగులకే కుప్పకూలింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ విరాట్ కోహ్లికి లభించింది.

నాదల్, స్వైటెక్ శుభారంభం

మెద్వదెవ్, సిట్సిపాస్ కూడా.. ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్‌లో రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన రఫెల్ నాదల్ శుభారంభం చేశాడు. సోమవారం నుంచి ప్రారంభమైన ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలిరౌండ్ పోటీలో నాదల్ 7-5, 2-6, 6-4, 6-1తో బ్రిటన్‌కు చెందిన జాక్ డ్రాపెర్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ మ్యాచ్‌లో డ్రాపెర్ గాయపడడంతో పూర్తిస్థాయి ఆటను ప్రదర్శించలేకపోయాడు. రెండోరౌండ్‌లో నాదల్ మెక్ డొనాల్డ్(అమెరికా)తో తలపడనున్నాడు. ఇతర పోటీల్లో 7వ సీడ్ డానియేల్ మెద్వదెవ్(రష్యా) 6-0, 6-1, 6-2తో గిరోన్(అమెరికా)పై, 3వ సీడ్, గ్రీక్‌కు చెందిన సిట్సిపాస్ 6-3, 6-4, 7-6(8-6)తో అన్‌సీడ్ ఫ్రాన్స్‌కు చెందిన హైస్‌పై గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. మరో హోరాహోరీ పోటీలో మసెట్టి(ఇటలీ) 4-6, 1-6, 7-6(7-0), 6-2, 6-7(4-10)తో అన్‌సీడెడ్ హర్రిస్(దక్షిణాఫ్రికా) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇతర పోటీల్లో 6వ సీడ్ అగర్(కెనడా), 11వ సీడ్ నొర్రి(బ్రిటన్) తొలిరౌండ్ పోటీలో గెలుపొందగా.. 21వ సీడ్ కోరిక్(క్రొయేషియా) 3-6, 3-6, 3-6తో లెహెక్రా(చెక్) చేతిలో ఓటమిపాలయ్యాడు.

స్వైటెక్, కీస్ గెలుపు..

మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్), 10వ సీడ్ కీస్(అమెరికా) రెండోరౌండ్‌లోకి ప్రవేశించారు. స్వైటెక్ 6-4, 7-5తో నేమియర్(జర్మనీ)పై సునాయాసంగా గెలుపొందగా.. కీస్ 6-4, 3-6, 6-2తో బ్లింకోవా(రష్యా)పై చెమటోడ్చి నెగ్గింది. ఇతర పోటీల్లో 32వ సీడ్ టిచ్మన్(స్విట్జర్లాండ్), 22వ రైబకినా(కజకిస్తాన్), 20వ సీడ్ క్రేజికోవా(చెక్), 17వ సీడ్ ఓస్టాపెంకో(లాత్వియా) ప్రత్యర్థులపై గెలిచారు.

ఆస్ట్రేలియా, అర్జెంటీనా మ్యాచ్ డ్రా

న్యూజిలాండ్‌పై నెదర్లాండ్స్ గెలుపు

హాకీ ప్రపంచకప్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌లో భాగంగా సోమవారం జరిగిన పోటీల్లో అర్జెంటీనా-ఆస్ట్రేలియా మ్యాచ్ డ్రా కాగా.. నెదర్లాండ్స్ జట్టు న్యూజిలాండ్‌పై, మలేషియా జట్టు చిలీపై, ఫ్రాన్స్ జట్టు దక్షిణాఫ్రికాపై గెలిచాయి. పూల్-ఏలో అర్జెంటీనా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్ 3-3గోల్స్‌తో డ్రా అయ్యింది. చివర్లో ఆస్ట్రేలియా జట్టు ఒక గోల్ కొట్టడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. తొలిమ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టు 2-1గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. పూల్-సిలో నెదర్లాండ్స్ జట్టు 4-0తో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. దీంతో ఈ గ్రూప్‌లో నెదర్లాండ్స్ జట్టు వరుసగా 2 మ్యాచుల్లో గెలిచి 6పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో మలేషియా జట్టు 3-2 గోల్స్ తేడాతో చిలీని ఓడించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68